ప్రజాశక్తి
విశాఖపట్నం
బుధవారం
జనవరి 03
2018
12 పేజీలు

రణ భూమి



రావికమతం మండలం కొత్తకోటలో నిలదీస్తున్న స్థానికులు

- ★ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇతర సమస్యలపై నిలదీతలు
- ★ జన్మభూమి కమిటీల పెత్తనంపై ఆగ్రహం
- ★ బోయలను ఎస్‌టిల్లో చేర్చడంపైనా...
- ★ మంత్రి గంటా, ఎమ్మెల్యే కిడారిని ప్రశ్నించిన ప్రజలు
- ★ బెడిసి కొట్టిన ప్రభుత్వ వ్యూహం

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలు రణ భూమిగా మారాయి. ఎన్‌టిఆర్ ఇళ్లు, పింఛన్లు, తెల్లరేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు తెలుగుదేశం వారికే అందుతున్నాయని, నిజమైన లబ్ధిదారుల దరిదాపులకు చేరడం లేదని బాధితులు గ్రామ సభల్లో నిలదీశారు. జన్మభూమి కమిటీ పెత్తనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమిలి మండలం కాపులుప్పాడలో మంత్రి గంటా శ్రీనివాసరావును, అరకులోయ మండలం చినలబుడు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కిడారి సరేశ్వరరావును సైతం ప్రజలు వదిలిపెట్ట లేదు. బోయలను ఎస్‌టిల్లో చేర్చడంపై టిడిపి ప్రజాప్రతినిధుల వైఖరి చెప్పాలని, జన్మభూమి గ్రామ సభల్లో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని పెద్ద పెట్టున గిరిజనులు డిమాండ్ చేశారు. గ్రామసభల్లో ఎటువంటి ఆందోళనలు, నిలదీతలు లేకుండా చేసుకునేందుకు ప్రభుత్వం సమాజ వికాసం, కుటుంబ వికాసం పేరుతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అయితే అవేవీ ప్రజల దృష్టిని మళ్లించలేకపోయాయి. దీంతో ప్రభుత్వ వ్యూహం బెడిసికొట్టునట్లయింది.

▶ వార్తలు లోపలి పేజీల్లో..



చినలబుడులో ఎమ్మెల్యే కిడారిని నిలదీస్తున్న గిరిజనులు



భీమిలి మండలం కాపులుప్పాడలో మంత్రి గంటాను నిలదీస్తున్న యువకుడు



సిపిఎం నాయకులను అరెస్ట్ చేసి నక్కపల్లి స్టేషన్‌లో ఉంచిన పోలీసులు

బూసిపుట్టులో మావోయిస్టుల బ్యానర్లు

17వ పిఎల్‌జిఎ వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపు

4లో

అలరించిన శ్రీకృష్ణ లీలలు

-132 ఏళ్లగా సురభి నాటకాలు
- పద్మశ్రీ వెంకటేశ్వరరావు

సెంటర్ స్ప్రెడ్‌లో..

5, 6 తేదీల్లో ఇంపాక్ట్-2018 కన్వెన్షన్

12లో

పోటెత్తిన బెల్లం



- ◆ మంగళవారం ఒకరోజే 42 వేలకు పైగా దిమ్మలు దిగుమతి
- ◆ ఈ ఏడాదిలో ఇదే అత్యధికం
- ◆ రూ.1.50 కోట్లకు పైగా వ్యాపారం

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక బెల్లం మార్కెట్‌కు మంగళవారం రికార్డు స్థాయిలో బెల్లం దిగుమతి అయింది. వివిధ ప్రాంతాల నుండి రైతులు పెద్ద ఎత్తున బెల్లాన్ని మార్కెట్‌కు విక్రయాల కోసం తీసుకొచ్చారు. మంగళవారం ఒక్కరోజే 42,581 బెల్లం దిమ్మలు మార్కెట్‌కు రైతులు తీసుకురావడం విశేషం. డిసెంబర్, 31, ఈ నెల 1 తేదీల్లో మార్కెట్ సెలవు దినాలు కావడంతో రైతులు మార్కెట్‌కు బెల్లాన్ని తరలించారు. అంతేకాకుండా సంక్రాంతి సమీపిస్తుండడంతో డబ్బులు కోసం రైతులు పెద్ద ఎత్తున బెల్లం తయారీలో నిమగ్నమయ్యారు. ఏ రోజు తెచ్చిన సరుకుకు ఆ రోజే చెల్లింపులు జరగడం ఇక్కడ మార్కెట్‌కు ఆనవాయితీ కావడంతో తెచ్చిన బెల్లానికి వచ్చిన రేట్ల ప్రకారం ఎవరి డబ్బు వారు పట్టుకెళ్లడం జరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక రోజుకు అత్యధికంగా 20 వేలు దిమ్మలు దిగుమతి కాగా మంగళవారం ఒక్కసారిగా 42వేలకు దాటి రావడం అటు కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతుంది. బెల్లం రేట్లు కూడా నిలకడగా ఉన్నాయి. మొదటి రకం 100 కేజీలు రూ.2,980 రూపాయల నుండి రూ.3,560 వరకు ధర పలికింది. రెండో రకం రూ.2,700 నుండి రూ.3,220 వరకూ, మూడో రకం రూ.2,590 నుండి రూ.2,970 వరకూ క్రయవిక్రయాలు జరిగాయి. మంగళవారం ఒక్కరోజే కోటి 50 లక్షల నుండి కోటి 80 లక్షల రూపాయలకు పైగా వ్యాపారం సాగింది. ఇతర

మిగతా 4లో..

'జన్మభూమి'లో నిరసనలు, నిలదీతలు

ఐదో విడత జన్మభూమి నిరసనలు, నిలదీతల మధ్య మంగళవారం ప్రారంభమైంది . గత జన్మభూమిల్లో ఇచ్చిన అర్జీలు, హామీలే నేటికీ పరిష్కారానికి నోచుకోని పరిస్థితుల్లో కొత్తగా మరో జన్మభూమి నిర్వహించి ప్రయోజనమేమిటని పలు గ్రామాల్లో ప్రజలు నిలదీశారు. జన్మభూమి కమిటీల పెత్తనంలో పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇతర సంక్షేమ లబ్ధి చేకూర్చడంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఏజెన్సీ గ్రామాల్లో బోయ,వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై గ్రామసభల్లో తీర్మానించి అధికారులకు నివేదించారు.


అధికారులను నిలదీస్తున్న విజయరామరాజుపేట గ్రామస్తులు

ఎమ్మెల్యే కిడారిని నిలదీసిన గిరిజనులు

అరకు రూరల్ : మండలంలో చినలబుడు పంచాయతీ కేంద్రంలో జరిగిన జన్మభూమిలో స్థానిక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, పాడేరు ఐటిడిఎ పిఒ పట్టన్‌శెట్టి రవిసుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత జన్మభూమి కార్యక్రమంలో ఇచ్చిన హామీలు, వచ్చిన సమస్యలను పరిష్కరించకుండా ఇప్పుడు మళ్లీ జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించడంపై గిరిజనులు ఎమ్మెల్యేను నిలదీశారు. చినలబుడులో మంచినీరు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు. పిఒ, ఎమ్మెల్యే స్పందించి సోలార్ ద్వారా మంచినీటి అందించేందుకు కృషి చేస్తామన్నారు.

రైతులకు పోడు భూమి పట్టాలివ్వాలి...

పోడు భూమి రైతులందరికీ పట్టాలివ్వాలని సిపిఎం అరకు డివిజన్ కార్యదర్శి సురేంద్ర, మండల కార్యదర్శి కె.రామారావు అధికారులను డిమాండ్ చేశారు.. మండల వ్యాప్తంగా గతంలో 3750 మంది దరఖాస్తులు చేసుకోగా 1673 మందికి పట్టాలిస్తామన్నా . ఒక్కరికి కూడా పట్టాలివ్వలేదన్నారు. గిరిజనులకు పోడు పట్టాలివ్వకపోవడం వెనుక బాక్సైట్ తవ్వకాల కుట్ర ఉందని విమర్శించారు. గన్నెల పంచాయతీలో తహశీల్దార్ అరుణ బృందం నిర్వహించిన జన్మభూమి సభలో కూడా సమస్యలపై అధికారులను గిరిజనులు నిలదీశారు. కార్యక్రమంలో పీసా కమిటీ సభ్యులు లింగమూర్తి, సర్పంచ్ వంతాల పూర్ణ, ఎంపిపి అరుణ, వైస్ ఎంపిపి అమ్మన్న, ప్రత్యేక అధికారి ప్రభాకర్, ఆర్‌డిఒ వేణుగోపాల్, ఎన్ఆర్‌ఇజిఎస్ ఎపిఒ కృష్ణమూర్తి, ఎంపిడిఒ మల్లికార్జునరావు, సిడిపిఒ ఉమా పాల్గొన్నారు.

పెదబయలు రూరల్‌లో...

మండలంలోని అడుగులపుట్టు, బొండాపల్లి, లక్ష్మీపేటల్లో కనీస సౌకర్యాలు కల్పించని పరిస్థితుల్లో మండలకేంద్రంలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఎంపిడిఒ వెంకన్నబాబు, తహశీల్దార్ సుధాకర్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దంటూ గిరిజన సంఘం, సిపిఎం, వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఎంపిపి ఉమామహేశ్వరరావు, ఎటిడబ్ల్యుఒ శాంతకుమారి, సిడిపిఒ మణిదేవి, మాజీ ఎంపిపి వి.కొండయ్య, సర్పంచ్ తైసాబు త్రినాథ్, సర్పంచ్‌లు కమల, వనిత, భూదన్న పాల్గొన్నారు.

హుకుంపేటలో...

మండలంలోని అడ్డుమండ, బారామసి, భీమవరం, అండిభ పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమం జరిగింది. అడ్డుమండలో మండల ప్రత్యేక అధికారి కూర్మన్ననాయుడు


కొత్త పింఛన్లు ఇవ్వకపోవడంతో మధ్యలోనే వెళ్లిపోతున్న జనం

హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శెట్టి మహేష్, ఎంపిడిఒ ఎన్‌వి.రామచంద్రమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ రమేష్‌బాబు, ఎంఇఒ రామచంద్రరావు, తహశీల్దార్ శ్యాంబాబు, ఇఒపిఆర్‌డి ఉషారాణి, గోపాలరావు పాల్గొన్నారు.

జి.మాడుగులలో...

జన్మభూమి కార్యక్రమంలో వచ్చిన వినతుల్లో ఎన్ని పరిష్కారం అయ్యాయో చెప్పాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎస్.ధర్మన్నపడాల్ జన్మభూమి అధికారులను నిలదీశారు. మండలంలోని కె.కోడాపల్లి, కుంబిడిసింగి, వంజరి, గెమ్మెలి పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమం జరిగింది. గెమ్మెలి పంచాయతీ సభలో బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో ఇచ్చిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని, బాక్సైట్ జిఒను రద్దు చేయాలని, తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవాలని, గిరిజన యూనివర్సిటీని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు వనుగు సన్యాసిదొర, వి.పిన్నంనాయుడు, సత్తిబాబు, నాగభూషణం, కొట్టి చిన్నబ్బాయి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే ఈశ్వరి

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కె.కోడాపల్లి పంచాయతీ జన్మభూమి సభలో పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. వంజరి, గెమ్మెలి జన్మభూమి కార్యక్రమంలో గిరిజన సలహామండలి సభ్యురాలు, మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, ఎంపిపి మత్స్యరాస వరహాలమ్మ, జెడ్‌పిటిసి సింగిడి ఆదినారాయణ, సర్పంచ్‌లు పలాసి చెల్లమ్మ, కృష్ణమ్మ కనకాలమ్మ, గెమ్మెలి అప్పలనాయుడు, ఎంపిటిసిలు సోమెలి జానకమ్మ, కొర్రా ఊర్మిళ, కె.రామకృష్ణ, ఎంపిడిఒ ఎస్.ప్రేమాకర్, తహశీల్దార్ పాడిపంతులు, టిడిపి మండల అధ్యక్షులు ఎస్.చిట్టిబాబు, నాగబ్బాయి, కల్యాణం పాల్గొన్నారు.

పాడేరు/పాడేరు రూరల్‌లో...

మండలంలోని బర్సింగి, డోకులూరు, బడిమెల, గొండెలి


అరకులో ఆలస్యంగా ప్రారంభమైన గ్రామసభ

పంచాయతీల్లో తహశీల్దార్ దుర్గా రవీంద్రనాథ్, ఎంపిడిఒ మధు మోహన్‌కుమార్ నేతృత్వంలో జరిగిన జన్మభూమిలో గిరిజనులు, గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.లక్కు, ఎంఎం.శ్రీను, సుందరరావు, నర్సయ్య, లింగేశ్వరరావు తదితరులు అధికారులను నిలదీశారు. గొండెలిలో పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయంపై తమ వైఖరిని తెలపాలని ఎమ్మెల్యేను నిలదీశారు. పాడేరు సబ్ కలెక్టర్ డికె.బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

మాకవరం, జోలాపుట్టు పంచాయతీ కేంద్రాల్లో జన్మభూమి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఎంపిడిఒ ప్రభాకరరావు, మండల ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు ఆలస్యంగా 2.15 గంటలకు ప్రారంభమైన సభకు కేవలం పింఛన్‌దారులు మాత్రమే హాజరయ్యారు. తాగునీరు, రహదారి, ఉపాధి బకాయి సొమ్ముల, ఎన్‌టిఆర్, ఇందిరమ్మ గృహాల బిల్లుల కోసం మాకవరం గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. ప్రసంగాలతో విసిగిన ప్రజలు మధ్యలోనే వెళ్లిపోయారు. స్థానిక ఎస్ఐ అరుణ్‌కిరణ్ ఆధ్వర్యంలో మాకవరం జన్మభూమికి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎంపిపి వి.పద్మ, టిడిపి మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు కె.పద్మ, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనంతగిరిలో...

మండలంలోని అనంతగిరి, రొంపల్లి పంచాయతీల్లో తహశీల్దార్ జయప్రకాష్, రొంపల్లిలో ఎంపిడిఒ రమేష్ రామన్ నేతృత్వంలో నిర్వహించిన జన్మభూమికి ప్రజాస్పందన లేక వెలవెలబోయింది. ముందస్తు ప్రచారం లేకపోవడంతో గిరిజనులెవ్వరూ కార్యక్రమానికి హాజరుకాలేదు. సమస్యలపై ఎంపిటిసి గంగరాజు, సర్పంచ్ నీలవేణి, రొంపల్లి ఎంపిటిసి శ్యాంసన్ తదితరులు తహశీల్దార్ జయప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. ఎంఇఒ వెంకటరావు, పిఆర్ జెఇ మాణిక్యం, హౌసింగ్ ఎఇ రవిబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చిరంజీవి, ఎంపిటిసి గంగరాజు, సర్పంచ్ నీలవేణి, వైద్యాధికారిణి షహీనా బేగం, తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణారావు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు, పింఛన్‌లపై అధికారుల నిలదీత

డుంబ్రిగుడ : అరకు పంచాయతీలో జన్మభూమి కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమయ్యింది. కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో పంచాయతీ గిరిజనులు హాజరుకాలేదు. కొల్లాపుట్టు పంచాయతీలో రేషన్‌కార్డులు, పింఛన్‌లకు దరఖాస్తులు చేసుకున్నామని, ఇప్పటివరకు ఎందుకు మంజూరు చేయలేదంటూ ఆ పంచాయతీ గిరిజనులు జన్మభూమి అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.మీనాకుమారి, తహశీల్దార్ బాబూసుందరం, ఎంఇఒ త్రినాథరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దంటూ తీర్మానం....

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చకూడదంటూ అరకులో సర్పంచ్ సిహెచ్.వెంకటరాజు, కొల్లాపుట్టులో సర్పంచ్ జమున, కొర్రాయిలో సర్పంచ్ గంగాధర్, సాగరలో సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యాన అఖిలపక్షం నాయకులు, గిరిజనులు తీర్మానం చేసి అధికారులకు తీర్మాన పత్రాన్ని అందించారు గిరిజన సంఘం మండల అధ్యక్షులు సురేష్, సత్యనారాయణ, సూర్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి కె.దయానిధి, వైసిపి మండల నాయకులు సుబ్బారావు, టిడిపి మండల నాయకులు మూర్తి, కె.ఆనంద్, స్వామి, సుబ్బారావు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

మండలంలోని కాశీపురం, చిననందిపల్లి, నాగయ్యపేట గ్రామాల్లో ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, జెడ్‌పిటిసి గాలి వరలక్ష్మి ఆధ్వర్యంలో జన్మభూమి మావూరు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అధికారి మహాలక్ష్మి, ఎంపిడిఒ డి.చంద్రశేఖర్, తహశీల్దార్ వైఎస్ నాగరాజు, సర్పంచ్ పూడి సత్యారావు, ఎంపిటిసిలు ఆదిరెడ్డి వరలక్ష్మి, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, బొడ్డు పేరినాయుడు, దాసరి గోపి, ఎస్ఐ పి.నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట, వద్దాదిలో...

సంక్షేమ పథకాల మంజూరులో జన్మభూమి కమిటీలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయని విజయరామరాజుపేటలో కాంగ్రెస్, వైసిపి నాయకులతో పాటు పలువురు గ్రామస్తులు అధికారులను నిలదీశారు. విజయరామరాజుపేట, మంగళాపురం గ్రామసభల్లో అర్హత ఉన్నప్పటికీ తమకు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయడం లేదని సభలో ఆరోపించారు. ప్రత్యేక అధికారి కేశవ్‌పాండే, ఎంపిపి చోడే కొండమ్మ, వైస్ ఎంపిపి దాడి సూరినాగేశ్వరరావు, సర్పంచ్ దొడ్డి కిషోర్ ఎంపిడిఒ టి.కొండలరావు, తహశీల్దార్ కెవివి శివ, అప్పలస్వామి, మాజీ జెడ్‌పిటిసి వియ్యపు అప్పారావు, సర్పంచ్ పత్తి రాము పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

మండలంలోని చౌడువాడ, పైడంపేట, కొరువాడ, డి.అగ్రహారం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాలలో మాడుగుల టిడిపి ఇన్‌ఛార్జి గవిరెడ్డి రామానాయుడు పాల్గొన్నారు. సమావేశంలో చంద్రన్న కానుకలు, రేషన్‌కార్డులు, పింఛన్లు తదితర పథకాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోయిడాపు జగదీశ్వరరావు, ఎంపిటిసి ఏటికూరి రాజేష్, టిడిపి నాయకులు దాడి ఎరుకునాయుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎంవి గోవిందరాజులు, తహశీల్దార్ బివి రాణి, ఎంఇఒ మధుమూర్తి, ఎఒ కెవిరామ్‌ప్రసాద్, ఎలక్ట్రికల్ ఎఇ బి.వెంకటరావు, మండల ఇంజనీరు సుధాకర్ మహంతి, ఐసి రమణాజీ, ఎపిఎం బండారు చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి ఎన్ రామునాయుడు, పైడంపేట సర్పంచ్ రొంగలి సృజన జ్యోతి, రొంగలి మహేష్ పాల్గొన్నారు.

కొత్తకోటలో...

గత సమస్యలను పరిష్కరించని పరిస్థితుల్లో కొత్తగా జన్మభూమి నిర్వహించడం వల్ల ప్రయోజనమేమిటని రావికమతం గ్రామసభల్లో అధికారులను కెవిపిఎస్, దళితసంఘాల ప్రతినిధులు, ప్రజలు నిలదీశారు. కన్నంపేట, చీమలపాడులో మండల తహశీల్దార్


కొత్తకోటలో నిలదీస్తున్న స్థానికులు

ఎస్.సిద్దయ్య, మర్రివలస, కొత్తకోటలో ఎంపిడిఒ కె.జయప్రకాష్‌రావు ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగాయి. కొత్తకోటలో గ్రామ సమస్యలపై స్థానిక కెవిపిఎస్ నాయకులు పూడి అర్జునరావు, అంబేద్కర్ సంఘం నాయకులు పూడి దేవా, డిసిసిబి డైరెక్టర్ జి.సత్యదేవ తదితరులు జన్మభూమి అధికారులను నిలదీసారు. చంద్రబాబు సందేశాన్ని చదవనీయకుండా అడ్డుకుని, ముందుగా సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన తమకు పింఛన్లు నిలిపేశారంటూ మాటూరి గౌరమ్మ, నిట్టా ముసిలి తదితరులు అధికారులను నిలదీసారు. మరుగుదొడ్లను నిర్మించినా బిల్లులు కాకుండా సర్పంచ్ భర్త, ఎంపిటిసి అడ్డుకుంటున్నారంటూ మాజీ సర్పంచ్ దంట్ల రమణ ఆరోపించారు. పరస్పర దూషణలతో జన్మభూమి సభ రసాబాసగా మారింది. కొత్తకోట ఎస్ఐ శేఖరం, పోలీసులు రంగప్రవేశం చేసి ఇరుపక్షాలను సముదాయించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.రామకృష్ణ, ఉప తహసీల్దార్ ఎస్ భాస్కర్‌రావు, ఇఒఆర్‌డి మహేష్, మండలటిడిపి అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, సర్పంచ్‌లు కోట నీలవేణి, వంజరి గంగరాజు, అమిరెడ్డి సత్యవతి, దంట్ల అరుణ,ఎంపిటిసి ఎస్.సత్యవతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చీడికాడలో...

మండలంలోని జి.కొత్తపల్లి, పెదగోగాడ గ్రామాల్లో మంగళవారం ఎంపిపి కుచ్చు కళావతి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మభూమిలో మాజీ ఎంఎల్ఎ గవిరెడ్డి రామానాయుడు పాల్గొన్నారు. చుక్కపల్లి, చెట్టుపల్లి గ్రామాల్లో తహశీల్దార్ పి.భాగ్యవతి ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగాయి. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎంపిడిఒ గ్లాడ్స్, ఇఒపిఆర్‌డి బి.చైతన్య, ఎఒ శ్యామ్‌ప్రసాద్, పాతాళం చిన్నంనాయుడు, మాజీ జెడ్‌పిటిసి పోతల రమణమ్మ, రెడ్డి సన్యాసినాయుడు, కొల్లు సూరినాయుడు పాల్గొన్నారు.

కొయ్యూరులో...

మండలంలోని మూలపేట, డౌనూరు, చిట్టింపాడు, గదబపాలెంలతో మంగళవారం జన్మభూమి గ్రామసభలు జరిగాయి. తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ ఇమ్మాన్యుయేల్ నేతృత్వంలో రెండు బృందాలు పాల్గొన్నాయి. ప్రత్యేకాధికారి పార్వతమ్మ జన్మభూమి ఆవశ్యకతను వివరించి, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిడిపిఒ గౌతమి,


ముంచంగిపుట్టులోజనాలు లేక వెలవెలబోతున్న గ్రామసభ

ఇఒఆర్‌డి వరలక్ష్మి, ఎంపిపి జి.సత్యనారాయణ, జెడ్‌పిటిసి శ్రీరామమూర్తి, జెఇ బసవేశ్వరరావు, ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

మాడుగులలో...

తాటిపర్తిలో ఎంపిడిఒ డేవిడ్ రాజు ఆధ్వర్యాన జన్మభూమి సభలో ప్రజల నుండి సమస్యలు తెలుసుకున్నారు. ఎంకోడూరులో స్పీడు బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని మజ్జి విశ్వనాథ్ కోరారు. మంచినీరు, కోతుల బెడద సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. మండల ప్రత్యేకాధికారి శైలజ, తహశీల్దార్ రామారావు, జన్మభూమి కమిటీ సభ్యులు మజ్జి రామారావు, వైస్ ఎంపిపి పెరుమాళ్ల వెంకటరావు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పురాతన వంతెనలు

- బయటకు కనిపిస్తున్న పిల్లర్ల పునాదులు
- ఇసుక తవ్వకాలే కారణం?
- మరమ్మతులు చేపట్టని అధికారులు



శిథిలావస్తకు చేరుకున్న వంతెన

ప్రజాశక్తి - గొలుగొండ

మండలంలోని జోగుంపేట, చీడికాడ జంక్షన్ వద్ద వున్న వంతెనలు శిథిలావస్తకు చేరేకున్నాయి. బొడ్డేరు గెడ్డపై చీడికాడ జంక్షన్ వద్ద, దారగెడ్డ పైన జోగుంపేట వద్ద, చీడిగుమ్మల వద్ద బ్రిటీషు వారి కాలంలో ఈ వంతెనలు నిర్మించారు. ఈ మూడు వంతెనలు గెడ్డ ఉధృతికి కొంతమేర, ఇసుక తవ్వకాల వలన కొంతమేర శిథిలమయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నర్సీపట్నం నుండి గొలుగొండ, కొయ్యూరు, తూర్పుగోదావరి జిల్లాలో పలు మండలాలకు వెళ్లడానికి ఈ వంతెనలను మార్గంగా ఉన్నాయి. శిథిలమైన వంతెనలకు ముప్పు ఏర్పడితే రాకపోకలు నిలిచిపోవాల్సిందే. వంతెనలను పర్యవేక్షించవలసిన సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోకపోవడం వలనే ఈ వంతెనలు శిథిలావస్తకు చేరుకున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. నీటి ఉధృతికి చీడిగుమ్మల వంతెన పిల్లర్లు, పునాదులు కోతకు గురై వంతెనకు ముప్పువాటిల్లే ప్రమాదం వుందని గ్రామస్తులు అంటున్నారు. ఇది గమనించిన అధికారులు గతేడాది రూ.20 లక్షలతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా పొర్లుకట్టు నిర్మించారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు నీటి ఉధృతికి మట్టి కొట్టుకుపోయి పిల్లర్లు కోతకు గరై పునాదులు బయటకు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది కూడా వర్షాలు అధికమయితే వంతెనకు ముప్పు తప్పదని స్థానికులు అంటున్నారు. అలాగే దారగెడ్డపైన ఉన్న వంతెన నిర్మించి చాలా కాలం కావడంతో శిథిలావస్తకు దగ్గరలో వుంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ వంతెనలకు త్వరగా మరమ్మత్తులు చేపట్టి, ముప్పును తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్ అండ్ బి జెఇ ప్రసాద్ వివరణ

వంతెనల పరిస్థితిపై ఉన్నతాధికారులదృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే మరమ్మత్తులు చేపడతాము.

వంతెనకు మరమ్మతులు చేయాలి



బ్రిటీషుకాలంలో నిర్మించిన వంతెనలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా రెండు జిల్లాను కలిపే ప్రధానరమదారిపైన ఉన్న వంతెనలుకు ముప్పు వాటిల్లితే రాకపోకలు పూర్తిగా ఆగిపోతాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలి.

- పరవాడ కవిశేశ్వరరావు, లింగంపేట.

వంతెన కూలితే ఇబ్బందులు తప్పవు



దారగెడ్డపైన నిర్మించిన వంతెన శిథిలావస్తకు చేరుకోవడంతో అటు నర్సీపట్నం వెళ్ళాలన్నా జోగుంపేట వంతెన దాటాలి, ఇటు తూర్పుగోదావరి జిల్లాలకు వెళ్ళాలన్నా చీడికాడ జంక్షన్‌ను దాటి వెళ్ళాలి. ఈ వంతెనలకు ముప్పు ఏర్పడితే ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడతారు.

-జె. కిరణ్ కుమార్, గొలుగొండ.

సమస్యల పరిష్కార వేదిక 'జన్మభూమి'

ప్రజాశక్తి - చోడవరం

సమస్యల పరిష్కారవేదికగా ఐదోవిడత జన్మభూమి కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లాకలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం అడ్డూరులో జన్మభూమి మావూరులో మాట్లాడుతూ పదిరోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో అన్ని అంశాలపై చర్చించి, సమస్యలను సమీకరించి వాటిని అక్కడికక్కడే ఆన్‌లైన్ చేసి పరిష్కార మార్గాలు సూచిస్తామన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులతో పాటు జన్మభూమి కమిటీ సభ్యులు భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన కొంతసేపు సభ్యుల నుంచి అర్జీలను స్వీకరించి ఆన్‌లైన్ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వేతనాల కోసం ఆశ కార్యకర్తలు కలెక్టర్‌కు విన్నవించారు. పింఛన్లు, ఇళ్లు, డ్రయినేజీల వంటివి మంజూరు చేయాలని కలెక్టర్‌కు గ్రామస్తులు వినతులిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి జయప్రకాష్ నారాయణ, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ కెవిఎస్ రవి, స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి కృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. గంధవరం, వెంకన్నపాలెం గ్రామాల్లోనూ జన్మభూమి నిర్వహించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

పింఛను పునరుద్ధరించాలని వినతి

చోడవరం : తమకు వచ్చే పింఛనును ఆరేళ్లుగా ఆపేశారని అడ్డూరు గ్రామానికి చెందిన నందవరపు రాజులమ్మ అనే మానసిక వికలాంగురాలు, ఆమె భర్త నందవరపు కన్నయ్య బోరున విలపించారు. జన్మభూమి గ్రామసభకు వచ్చి మరోమారు తమ గోడును వినిపించారు. తామెన్ని సార్లు అర్జీలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదని రాజులమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. సదరన్ సర్టిఫికెట్ లేని కారణంగా 2011లో తమకిచ్చే పింఛను నిలుపుదల చేశారన్నారు. వైకల్యంతోపాటు వృద్ధాప్యం వల్ల జీవించడం కష్టంగా ఉందని భార్యాభర్తలిద్దరూ బోరుమన్నారు. షరామామూలుగానే సదరం సర్టిఫికెట్ లేకుంటే పింఛను ఇచ్చేదిలేదని అధికారులు పాతపాటే పాడడంతో ఊసూరుమంటూ వెనుదిరిగారు.



పింఛను కోసం విలపిస్తున్న వృద్ధులు

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని యువకుడు మృతి



లారీ కింద పడి చనిపోయిన నాయుడు(ఇన్‌సెట్‌లో)

ప్రజాశక్తి- సబ్బవరం

మండల కేంద్రంలోని జోడుగుళ్ల జంక్షన్ వద్ద మంగళవారం లారీ ఢీకొని ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సబ్బవరం పాత పోస్టాఫీస్ వీధికి చెందిన గండి నాయుడు (22) ఉదయాన్నే జోడుగుళ్ల జంక్షన్‌కు టీ తాగడానికి వెళ్లి రోడ్డు దాటుతున్న క్రమంలో అనకాపల్లి నుండి పెందుర్తి వెళ్తున్న లారీ జోడుగుళ్ల జంక్షన్ వద్ద ఢీకొంది. దీంతో నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు సన్నిబాబు, మహాలక్ష్మి కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. స్థానిక ఎస్ఐ ఎన్ ప్రభాకరరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించారు.

ఐసిడిఎస్ భవనం ప్రారంభం

నక్కపల్లి : నక్కపల్లి మార్కెట్ సమీపంలో ఐసిడిఎస్ నూతన భవనాన్ని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం ప్రారంభించారు. రూ.53 లక్షలతో సమగ్ర శిశుఅభివృద్ధి సేవా పథకం అధికారి కార్యాలయాన్ని నూతనంగా నిర్మించారు. ఇప్పటి వరకు అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వంగలపూడి అనిత సమక్షంలో మంత్రి యనమల భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెసి సృజన, ఆర్‌డిఒ సూర్యారావు, ఐసిడిఎస్ పిడి చిన్మయిదేవి, పిఒ శారదాదేవి, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ రాణి అమ్మాజీ, ఇఒఆర్‌డి పిఎస్ కుమార్, జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ కొప్పిశెట్టి కొండబాబు, ఎంపిపి లావణ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తైక్వాండోలో మహేష్ ప్రతిభ

కశింకోట : ఇటీవల కేరళ రాష్ట్రంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో కశింకోట డిపిఎన్ బాలుర స్కూల్ విద్యార్థి డి.మహేష్ విజయం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని మంగళవారం డిపిఎన్ పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె శ్రీధర్‌రెడ్డి, పిడి టి గోపీనాథ్, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జన్మభూమి గ్రామసభలు

అచ్యుతాపురం : బుధవారం మండలంలో జన్మభూమి గ్రామ సభలు జంగులూరు, దిబ్బపాలెం, అచ్యుతాపురం గ్రామాల్లో జరుగుతాయని ఎంపిడిఒ పి బలరాముడు తెలిపారు. అచ్యుతాపురం గ్రామసభకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

సినిమా... సినిమా



అనకాపల్లిలో సినిమాలు

సత్యనారాయణ స్క్రీన్ 1	హలో
సత్యనారాయణస్క్రీన్ 2	మళ్లీరావా
రామచంద్ర	ఆక్సిజన్
పర్లిసాయి	ఎంసిఎ
షిర్డిసాయి	సీత
రాజా	ఒక్క క్షణం
వెంకటేశ్వర	సప్తగిరి ఎల్ఎల్‌బి

చోడవరం

సాయిలక్ష్మి	- ఎంసిఎ
శ్రీసాయిలక్ష్మి	- హలో
సాయిసిరిమేక్స్	- దేవిశ్రీప్రసాద్
పూర్ణ	-మళ్లీరావా..

నర్సీపట్నం

శ్రీకన్య :	జవాన్
కన్య :	లచ్చి
కన్యమినీ:	రాజా ది గ్రేట్
సాయిశ్రీకన్య:	10
రాజు మూవీమేక్స్:	సీత రాముని కోసం
బంగార్రాజు :	సప్తగిరి ఎల్ఎల్‌బి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-పెందుర్తి

అర్హులందరికీ సంక్షేమ పథకాలనందించడమే జన్మభూమి కార్యక్రమం లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని ఎస్.ఆర్.పురంతోపాటు పలు గ్రామాల్లో మంగళవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలు, కులాలు, మతాలకతీతంగా ప్రభుత్వ పథకాలందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమన్నారు. విభజన కష్టాలున్నప్పటికీ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడానికి కృషి చేస్తున్నారని చెప్పారు.

నిలదీతలు

అనర్హులకు పక్కాఇళ్లు, పింఛన్లు ఇచ్చి పేదలకు అన్యాయం చేస్తున్నారని కొందరు మహిళలు ఎమ్మెల్యేను, అధికారులను నిలదీసారు. ఆ సమయంలో అక్కడ గంధరగోళం నెలకొంది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని మహిళలకు నచ్చజెప్పి అక్కడినుంచి పంపించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, తహశీల్దారు, ఎంపిడిఒ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే టిడిపి లక్ష్యం

వేపగుంట : ప్రజా సంక్షేమమే టిడిపి ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం వేపగుంట హైస్కూల్ ప్రాంగణంలో 5వ విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విడదీసినప్పుడు సుమారు రూ.17 వేల కోట్లు లోటు బడ్జెట్ ఉందని తెలిపారు. ఈ పరిస్థితులనుంచి గట్టు ఎక్కిచేందుకు 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు అధికారం కట్టబెట్టారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. అనంతరం కొత్త రేషన్ కార్డులు, చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరవ జోన్ కమిషనర్ చుక్కా సత్యనారాయణ, టిపిఒ ప్రసాదరావు, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీవిద్య, సూపర్ వైజర్ అచ్యుత్, ప్రజారోగ్య వైద్యాధికారి కెవిఎస్.జ్యోతి, రెవెన్యూ ఎసిఎం లక్ష్మి, టౌన్‌ప్లానింగ్ ఎఇ రామలింగారెడ్డి, ప్రభుత్వ హోమియో వైద్యులు మోహన్ పాల్గొన్నారు.

రణ భూమి

★ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇతర సమస్యలపై నిలదీతలు
★ జన్మభూమి కమిటీల పెత్తనంపై ఆగ్రహం
★ బోయలను ఎస్‌టిల్లో చేర్చడంపైనా...
★ ఎమ్మెల్యే కిడారిని ప్రశ్నించిన గిరిజనులు
★ బెడిసి కొట్టిన ప్రభుత్వ వ్యూహం

ప్రజాశక్తి - విశాఖపట్నం

గత జన్మభూమి కార్యక్రమంలో ఇచ్చిన హామీలు, వచ్చిన సమస్యలను పరిష్కరించకుండా ఇప్పుడు మళ్లీ జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించడంపై అరకులోయ మండలం చినలబుడు పంచాయతీ కేంద్రంలో జరిగిన జన్మభూమిలో స్థానిక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావును గిరిజనులు నిలదీశారు. మంచినీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జి.మాడుగుల గెమ్మిలలో బాక్సైట్ జిఒను రద్దు చేయాలని, తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని, గిరిజన యూనివర్సిటీని నెలకొల్పాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పాడేరు మండలం బర్సింగి, దోకులూరు, బడిమెల, గొండెలి పంచాయతీల్లో జరిగిన గ్రామ సభల్లో గిరిజనులు, గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు పలు సమస్యలపై నిలదీశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, బాక్సైట్ తవ్వకాల జిఒను రద్దు చేయాలని, కొండ కుమ్మర్లను ఎస్‌టి జాబితాలో చేర్చాలని, విలేజ్‌మాల్స్ నిర్ణయాన్ని రద్దుచేసి జిసిసి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ముంచంగిపుట్టు మండలం మాకవరం, జోలాపుట్టు పంచాయతీ కేంద్రాల్లో జన్మభూమి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. తాగునీరు, రహదారి, ఉపాధి బకాయి సొమ్ములు, ఎన్‌టిఆర్, ఇందిరమ్మ గృహాల బిల్లుల కోసం మాకవరం గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు పంచాయతీలో రేషన్‌కార్డులు, పింఛన్లకు దరఖాస్తులు చేసుకున్నామని, ఇప్పటివరకు ఎందుకు మంజూరు చేయలేదంటూ ఆ పంచాయతీ గిరిజనులు ప్రశ్నించారు. పెదబయలు మండలం లక్ష్మీపేట, బొండపల్లి పంచాయతీల్లో గత జన్మభూమి సమస్యలనే పరిష్కరించకుండా, ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టకుండా కొత్తగా మళ్లీ జన్మభూమి నిర్వహించి ప్రయోజనమేమిటని గిరిజనులు ప్రశ్నించారు.

బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై..

బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై జన్మభూమి కార్యక్రమంలో గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడేరు మండలంలో జరిగిన గ్రామ సభల్లో బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయంపై తమ వైఖరిని తెలపాలని ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు నిలదీశారు. డుంబ్రిగుడ, జి.మాడుగుల మండలాల్లో జరిగిన సభల్లోనూ ఇదే అంశంపై గిరిజనులు నిలదీశారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చకూడదంటూ అరకులో సర్పంచ్ సి.హెచ్.వెంకటరాజు, కొల్లాపుట్టులో సర్పంచ్ జమున, కొర్రాయిలో సర్పంచ్ గంగాధర్, సాగరలో సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యాన అఖిలపక్షం నాయకులు, గిరిజనులు తీర్మానం చేసి అధికారులకు తీర్మాన పత్రాన్ని అందించారు.

గ్రామీణంలోనూ...

గ్రామీణ ప్రాంతంలోనూ నిలదీతల పర్వం సాగింది. బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటలో కాంగ్రెస్, వైసిపి నాయకులతో పాటు పలువురు గ్రామస్తులు జన్మభూమి కమిటీల పెత్తనంపై నిలదీశారు. అర్హత ఉన్నప్పటికీ తమకు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయడం లేదని సభలో ఆరోపించారు. నిర్మించుకొన్న కొంతమందికి ఇప్పటికీ బిల్లులు కాలేదని, ఉపాధి కూలీలకు ఏడాది కాలంగా బిల్లులు విడుదల చేయలేదని తెలిపారు. రావికమతం మండలం కొత్తకోటలో గ్రామ సమస్యలపై స్థానిక కెవిపిఎస్ అంబేద్కర్ సంఘం నాయకులు అధికారులను నిలదీశారు. ప్రభుత్వ భూములకు రక్షణ లేక అన్యాక్రాంతమౌతున్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. పింఛన్లపై వృద్ధులు ప్రశ్నించారు. మరుగుదొడ్లను నిర్మించినా బిల్లులు కాకుండా సర్పంచ్ భర్త, ఎంపిటిసి అడ్డుకుంటున్నారంటూ ప్రశ్నించారు. పరస్పర దూషణలతో జన్మభూమి సభ రసాభాసగా మారింది. గత జన్మభూమిలో దరఖాస్తు చేసుకున్న పింఛన్, రేషన్ కార్డులు ఇంకా మంజూరు కాలేదని, అవి ఎప్పుడు మంజూరు చేస్తారని అనకాపల్లి మండలంలోని భట్లపూడి, అక్కిరెడ్డిపాలెం, గోపాలపురం గ్రామస్తులు నిలదీశారు. ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నం గ్రామంలో జరిగిన జన్మభూమిలో గ్రామసభ తీర్మానం లేకుండా ఇళ్లు ఎలా మంజూరు చేశారని అధికారులను సర్పంచి దారబోయిన గంగ భర్త రాము ప్రశ్నించారు. ఇదే మండలంలోని చినగుమ్ములూరులో పింఛన్లు, ఇళ్లు, రేషన్ కార్డులు అర్హులకు ఇవ్వడం లేదని నిలదీశారు.

సిపిఎం నాయకుల ముందస్తు అరెస్టు

నక్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు రావడంతో సిపిఎం నాయకులు ఎం.అప్పలరాజు, పి.వెంకటస్వామి, సత్యనారాయణ, దాసులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జన్మభూమి కార్యక్రమం ముగిసిన తరువాత వారిని విడుదల చేశారు. సభలో సక్రమంగా రుణమాఫీ చేయలేదని నక్కపల్లికి చెందిన రైతు కొల్నాటి అప్పారావు నిలదీయడంతో పోలీసులు ఆయనను కూడా అదుపులోకి తీసుకున్నారు.

ప్రారంభం రోజే మంత్రికి చుక్కెదురు

పింఛన్లు, రేషన్ కార్డుల కోసం గంటాను నిలదీసిన పేదలు

గందరగోళంగా జన్మభూమి గ్రామసభ



మంత్రి గంటా శ్రీనివాసరావును నిలదీస్తున్న మహిళలు


ప్రజాశక్తి - భీమునిపట్నం

'ఏళ్ల తరబడి కాగితాలు పెడుతున్నా పింఛన్లు ఇవ్వడం లేదు. రేషన్ కార్డులూ మంజూరు చేయడం లేదు. ఎవరి కోసం ఈ 'గ్రామసభలు' అంటూ మండలంలోని కాపులుప్పాడ పంచాయతీకి చెందిన పలువురు పేదలు రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావును నిలదీశారు. పంచాయతీ సర్పంచ్ నారు సంతోషికుమారి అధ్యక్షతన మంగళవారం మండలంలోని కాపులుప్పాడ కల్యాణ మండపం ఆవరణలో 5వ విడత జన్మభూమి- మా ఊరు గ్రామసభ జరిగింది. తొలుత ఎంపిడిఒ కె.హరి ప్రసాదరావు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం పంచాయతీ పరిధిలో పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఎప్పుడెప్పుడు, ఎన్నెన్ని దరఖాస్తులు వచ్చినవి, సంబంధిత అధికారులు సభలో చదివి వినిపించారు. ఇంతలో దుంప కనకమ్మ అనే మహిళ నిలబడి పింఛను కోసం దరఖాస్తు చేసి సంవత్సరమైందని, ఇప్పటికీ ఇవ్వలేదని, ఎందుకొచ్చిన జన్మభూమి అంటూ మంత్రి గంటాను నిలదీసింది. 2016లో దరఖాస్తు చేశానని, ఇప్పటి వరకు రేషన్ కార్డు మంజూరు చేయలేదంటూ ఎండ్రెడ్డి నర్సింహం ప్రశ్నించారు. జనసేన సేవాదళ్ కో-ఆర్డినేటర్ ఈశ్వర్ వేముల మాట్లాడుతూ అర్హులైన పేదలను కాదని కొంతమంది పెద్దోళ్లకు ఎన్‌టిఆర్ ఇళ్లు మంజూరు చేశారని, ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు జరపాలని మంత్రిని డిమాండ్ చేశారు. ఒకానొక దశలో నేరుగా మంత్రి వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా సిఐ ఎస్ బాల సూర్యారావు, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో వైసిపి, జనసేన కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వ స్థలం లేదంటూ చెప్పడం ఏ మేరకు సబబని, ఇదే పంచాయతీ మాజీ సర్పంచ్ ఎరుసు అప్పలకొండ మంత్రిని ప్రశ్నించారు.

ఉనికి కోసమే అల్లరి : గంటా

కొంతమంది ప్రజాబలం లేనివార్లు రాజకీయంగా ఉనికి కాపాడుకోవడం కోసమే ఇలా అల్లరి చేస్తుంటారని మంత్రి గంటా తీవ్రంగా స్పందించారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం పంచాయతీకి మంజూరైన రేషన్ కార్డులు, పింఛన్లను మంత్రి గంటా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి జిల్లా ప్రత్యేకాధికారి వైవి అనూరాధ, ఎంపిపి యరబాల కృష్ణవేణి, ఎంపిటిసి కె.గౌరి, జెడ్‌పిటిసి సరగడ అప్పారావు, మాజీ ఎంపిపిలు గాడు వెంకటప్పడు, ఉప సర్పంచ్ బోర బంగారురెడ్డి, టిడిపి నాయకులు కోరాడ రాజబాబు, చిక్కాల విజయ్‌బాబు, దంతులూరి అప్పల నర్సింహరాజు, పాసి నర్సింగరావు పాల్గొన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మంత్రి సందర్శించారు.

ఇథియోపియావర్సిటీకి గీతం మేధో సహకారం




అవగాహన ఒప్పందాన్ని చూపిస్తున్న ఇరు వర్సిటీల అధికారులు

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఇథియోపియాలోని ప్రభుత్వరంగంలో నూతనంగా ఏర్పాటయిన వకేమో విశ్వవిద్యాలయం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మేధో సహకారాన్ని కోరుతూ మంగళవారం అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసింది. గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.ఎస్.ప్రసాదరావు సమక్షంలో వకేమో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు (అకడమిక్ వ్యవహారాలు) డాక్టర్ అడెన్ హైల్ గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా గీతం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ, దేశంలో అత్యుత్తమ శ్రేణి విశ్వవిద్యాలయంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గుర్తింపు సాధించిందని ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, సైన్స్, లా కోర్సులతో పాటు అంతర్జాతీయ వాణిజ్యం, మేనేజ్‌మెంట్ అంశాలపై 140కి పైగా కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కలిసి గీతం సంయుక్త ఒప్పందాలను కలిగి ఉందన్నారు. ఇథియోపియా విశ్వవిద్యాలయంతో కలిసి పని చేయడానికి ఆసక్తితో ఉన్నామన్నారు. వకేమో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డాక్టర్ అడెన్ హైల్ మాట్లాడుతూ వివిధ దేశాలకు చెందిన 1700 మంది విద్యార్థులు తమ వద్ద వృత్తి విద్యలు అభ్యసిస్తున్నారని, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కోర్సుల్లోని ఉన్నత ప్రమాణాలు పరిశీలించి అవగాహనా ఒప్పందానికి ముందుకు వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రొ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, గీతం అంతర్జాతీయ వ్యవహారాల విభాగం డైరెక్టర్

బూసిపుట్టులో మావోయిస్టుల బ్యానర్లు

17వ పిఎల్‌జిఎ వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపు



బూసిపుట్టులో మావోయిస్టులు కట్టిన బ్యానర్లు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు

ముంచంగిపుట్టు మండలం మారుమూల బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో మంగళవారం మావోయిస్టుల పేరిట బ్యానర్లు వెలిశాయి. వారపుసంత ప్రాంగణంలోని చెట్లు, దుకాణాల వద్ద సిపిఐ మావోయిస్టు పేరిట బ్యానర్లు కట్టారు. '17వ పిఎల్‌జిఎ ఆవిర్భావ వారోత్సవాలను గ్రామగ్రామన జరుపుకుందాం. ప్రజా సైన్యం లేకుండా ప్రజలకేమీ ఉండదు. యువతి, యువకుల్లారా ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలో చేరండి. ప్రజా విముక్తి కోసం పోరాడండి. గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం. శత్రు సాయుధ బలగాలను నిర్మూలిద్దాం. ప్రజా యుద్ధాన్ని బలంగా కొనసాగిద్దాం. విప్లవ ప్రజా రాజ్యాధికారాన్ని సాధిద్దాం. ప్రజా యుద్ధంలో అమరులైన పిఎల్‌జిఎ యోధులకు జోహార్లు అర్పిద్దాం. ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం జిందాబాద్. సిపిఐ మావోయిస్టు జిందాబాద్. నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి.' అంటూ ఆ బ్యానర్లలో పేర్కొన్నారు. మంగళవారం వారపుసంత వచ్చిన వారంతా బ్యానర్లను చూసి భయందోళనకు గురయ్యారు. వ్యాపారులు కూడా వ్యాపార లావాదేవీలను తొందరగా ముగించుకొని ఇంటి బాట పట్టారు. పిఎల్‌జిఎ వారోత్సవాలు ప్రచారంలోకి రావడంతో ఏజెన్సీలో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి.

మొదటి పేజీ తరువాయి

పోటెత్తిన బెల్లం

రాష్ట్రాల నుండి డిమాండ్ ఉండడంతో ఎగుమతి వ్యాపారులు బెల్లాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. దీంతో మార్కెట్ కళకళలాడింది. మహారాష్ట్ర, కర్నాటక, పశ్చిమబెంగాల్, ఒడిశా, జార్ఖండ్ వంటి ప్రాంతాలకు బెల్లం ఎక్కువగా ఎగుమతి జరుగుతుందని వర్తకులకు తెలిపారు. ముందుముందు మార్కెట్‌కు మరింత బెల్లం దిగుమతి పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. ఏది ఏమైనా మంగళవారం మార్కెట్‌కు బెల్లం పెద్ద ఎత్తున తరలిరావడంతో అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తమవుతుంది.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన



మార్చురీ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

ప్రజాశక్తి-అరకు రూరల్

విద్యుదాఘాతంతో మృతి చెందిన సిఎం దత్తత పంచాయతీ పెదలబుడు పరిధిలోని గరడగుడ గ్రామానికి చెందిన వంతాల మోహనరావు (24) కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుని న్యాయం చేయాలని సిపిఎం ఆధ్వర్యాన బాధిత కుటుంబసభ్యులు మంగళవారం ఆందోళన చేపట్టారు. సోమవారం రక్షితనీటి పథకం మోటారు స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లిన మోహనరావు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రి మార్చురీ వద్దకు పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం తీసుకువచ్చారు. ప్రభుత్వం ,అధికారులు నిర్లక్ష్యం వల్లే మోహనరావు మృత్యువాత పడ్డాడని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఎం నాయకులు, మృతురాలి కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, ఐటిడిఎ పిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ కాంట్రాక్టర్ వచ్చేవరకు పోస్టుమార్టం చేయొద్దని డిమాండ్ చేస్తూ ఏరియా ఆస్పత్రి మార్చురి వద్ద బైఠాయించారు. సిపిఎం నాయకులు కిల్లో సురేంద్ర, ఉమామహేశ్వరరావు, రామారావు, తాంగుల హరి ఆధ్వర్యంలో కుటుంబీకులు ఆందోళనకు దిగి, ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఒ సమాధానం చెప్పేవరకు పోస్టుమార్టం నిర్వహించొద్దని భీష్మించారు. సమాచారం మేరకు స్థానిక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, ఐటిడిఎ పిఒ రవిసుభాష్ పట్టన్‌శెట్టి ఆసుపత్రికి చేరుకొని సిపిఎం నాయకులు, మృతుడి



మార్చురీ వద్ద బిడ్డకు పాలిస్తున్న మృతుని భార్య



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పిఒ

బంధువులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి మృతుడి కుటుంబానికి రావాల్సిన నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కిడారి హామీనిచ్చారు. చంద్రన్నబీమా, ఐటిడిఎ నుంచి రావాల్సిన పరిహారంపై పిఒ హామీనిచ్చారు. ఎమ్మెల్యే కిడారి, సర్పంచ్ గులాబీ చొరవతో కాంట్రాక్టు ద్వారా లక్ష రూపాయాల పరిహారం ఇచ్చేందుకు ఒప్పందం కుదిర్చారు. దీంతో ఆందోళనను విరమించారు. అనంతరం మృతుడికి పోస్టుమార్టం నిర్వహించారు. దీంతో ఆసుపత్రి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సిఐ వెంకినాయుడు, డుంబ్రిగుడ ఎస్ఐ అమ్మనరావులు పోలీసు బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

బోయవాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దంటూ జన్మభూమి సభల్లో తీర్మానించండి

హుకుంపేట : బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల అధ్యక్షులు ఎస్.పుణ్యారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న జన్మభూమి కార్యక్రమాల్లో బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని రద్దు చేస్తున్నట్టు అధికారులు తీర్మానం చేయాలన్నారు. గిరిజనులతో సమానంగా జీవిస్తున్న కొండ కుమ్మర్లను వదిలి బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు కుట్ర పన్నడం సరికాదని, ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానంపై గిరిజన ఎమ్మెల్యేలు తమ వైఖరిని తెలపాలన్నారు. సిపిఎం నాయకులు రామారావు, లక్ష్మణరావు, రమణమూర్తి, చిరంజీవి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామాల్లో ప్రజలకు అవగాహన

పాడేరు రూరల్ : ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మండలంలోని ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామాల్లో పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.అప్పారావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 దత్తత తీసుకున్న డి.గొందూరు, కరకపుట్టు గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య సూత్రాలు, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రోగ్రాం అధికారులు గౌరీశంకరరావు, కొత్తంనాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ధర్నా చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

వేతనాలు పెంచాలని ధర్నా

హుకుంపేట : సిహెచ్‌డబ్ల్యుల వేతనాలు పెంచాలని కోరుతూ ఈ నెలాఖరులో విజయవాడలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సిఐటియు మండల నాయకురాలు ఎస్.హైమావతి తెలిపారు. మంగళవారం సిహెచ్‌డబ్ల్యులు తమ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో హుకుంపేట పిహెచ్‌సి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయకుండా సిహెచ్‌డబ్ల్యులతో వెట్టిచాకిరీ చేయించుకోవడం సరికాదన్నారు. తక్షణమే వారి వేతనాలు పెంచాలని, యూనిఫారం అలవెన్సులు, బకాయి వేతనాలు అందించాలని, టిఎ, డిఎ, ప్రమాదబీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌లపై చేపట్టే ధర్నాకు సిహెచ్‌డబ్ల్యులంతా హాజరుకావాలని కోరారు. సిఐటియు నాయకులు పెద్దమ్మ, చిలకమ్మ, ముత్యాలమ్మ, సావిత్రి, శాంతి, సిహెచ్‌డబ్ల్యులు పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పాడేరు : డిఎస్‌సి అభ్యర్థులకు గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, గిరిజన యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నామని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.నర్సయ్య తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ అందించనున్నామని, ఆసక్తి గలవారు తమ పేర్లను ఎపిజిఎస్ కార్యాలయానికి వచ్చి నమోదు చేసుకోవాలని కోరారు.

తొలగించిన ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోకుంటే ఆమరణదీక్ష

ప్రజాశక్తి-పాడేరు

తొలగించిన 95 మంది కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోకుంటే ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం ఆరోగ్య కార్యకర్తల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఆరోగ్య కార్యకర్తలు దీక్షలు చేపట్టి నేటికి 14 రోజులు గడుస్తున్నా అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. విశాఖ మన్యంలో వైద్య సేవలు అంతంతమాత్రంగా ఉంటున్న తరుణంలో ఆరు నెలల కాల పరిమితిని విధించి ఆరోగ్య కార్యకర్తలను తొలగించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. 14 రోజులుగా హెల్త్ అసిస్టెంట్లు ఆందోళనలు చేస్తున్నా అధికారుల్లో చలనం లేకపోవడం విచారకరమన్నారు. తొలగించిన ఆరోగ్య



దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న అప్పలనర్స

కార్యకర్తలను తక్షణమే విధుల్లోకి తీసుకొని వారి ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. వైద్య ఆరోగ్య కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శెట్టి నాగరాజు, అధ్యక్షులు లక్ష్మణ్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చే అసెంబ్లీ తీర్మానాన్ని అడ్డుకోవాలి

ఎమ్మెల్యే కిడారికి సిపిఎం వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సురేంద్ర, తదితరులు

అరకు రూరల్ : బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానాన్ని అడ్డుకోవాలని సిపిఎం అరకు డివిజన్ కార్యదర్శి కిల్లో సురేంద్ర, నాయకులు రామారావు, చినలబుడు సర్పంచ్ వంతాల పూర్ణ మంగళవారం ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడం సరికాదన్నారు. గిరిజనులకు అన్యాయం జరిగే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ప్రభుత్వంలో మాట్లాడాలన్నారు. అలాగే మత్స్యకారులను కూడా ఎస్‌టి జాబితాలో చేర్చాలని చూస్తున్నారని, ఈ నిర్ణయాన్ని కూడా ఉపసంహరించుకోవాలన్నారు. గిరిజనులతో సమానంగా జీవిస్తున్న కొండకుమ్మర్లను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కిడారి సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావించి తీర్మానం రద్దయ్యేలా చూస్తానన్నారు. బిల్లు పాసైతే తాను రాజీనామా చేసి గిరిజనులతో కలిసి పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

టెలీకాన్ఫరెన్స్‌తో అధికారుల ఇబ్బందులు

జి.మాడుగుల : ఉదయం నుంచి సాయంత్రం వరకు జన్మభూమి కార్యక్రమం నిర్వహించుకొని వచ్చిన అధికారులకు సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ ఉండడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. మన్యంలో చలి ఎక్కువగా ఉండడం, గ్రామసభల్లో సమస్యలపై గిరిజనుల నిలదీతతో ఇబ్బందులు పడుతున్న అధికారులు, అలసిపోయి కార్యాలయానికి వచ్చిన తర్వాత టెలీ కాన్ఫరెన్స్‌కు తప్పనిసరిగా హాజరుకావాలనడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇది సరికాదని, జన్మభూమి కార్యక్రమం ఉన్నంతవరకు టెలీకాన్ఫరెన్స్‌ను రద్దు చేయాలని పలువురు అధికారులు కోరుతున్నారు.



చంద్రన్న సంక్రాంతి కానుకలు అందిస్తున్న బలరాం

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి మండల అధ్యక్షులు కె.బలరాం అన్నారు. మంగళవారం స్థానిక జిసిసి డిఆర్ డిపో ద్వారా సంక్రాంతి కానుకలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు అందుతున్నాయని అన్నారు. సంక్రాంతి పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా ఆరు రకాల సరకులను రేషన్ లబ్ధిదారులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వి.పద్మ, టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర జిల్ల కార్యదర్శులు జి.రామ్మూర్తి, ఎ.తిరుపతిరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కె.పద్మ, సర్పంచ్ రుక్మంధర్, జిసిసి మేనేజరు ఎస్.మోహన్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.బంగారయ్య, గొడౌన్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్, సుజనకోట సర్పంచ్ నీలకంఠం, సేల్స్‌మెన్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న జెడ్‌పిటిసి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ

మండల కేంద్రంలోని స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ ముద్రించిన 2018 క్యాలెండర్, డైరీలను మంగళవారం ఆ సంఘం అధ్యక్షులు ఎస్.కన్నయ్య ఆధ్వర్యాన స్థానిక జెడ్‌పిటిసి సభ్యురాలు కుజ్జమ్మ ఆవిష్కరించారు. అనంతరం డైరీలు, క్యాలెండర్‌లను ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నిజాయితీగా, నిస్వార్థంగా పనిచేస్తుందన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదే ఆశయంతో పనిచేసి ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రఘునాథ్, గౌరవ అధ్యక్షులు కొండలరావు, జిల్లా కౌన్సిలర్‌లు సత్యనారాయణ, గాసన్న, సుబ్బారావు, మండల నాయకులు చంద్రశేఖర్, దేముళ్లు, నాగేశ్వరరావు, సంజీవరావు, ఎం.మోహనరావు, ఎం.చందరరావు, ఎస్.బాలకృష్ణ, అప్పలస్వామి, జార్జి, సుధాకర్ పాల్గొన్నారు.

పెదబయలు రూరల్‌లో...

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆ సంఘం మండల అధ్యక్షులు జె.సత్యనారాయణ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు, సంఘం నాయకులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకన్నబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సింహాచలం, ఎంఇఒ సింహాచలం, యుటిఎఫ్ మండల కార్యదర్శి జి.ప్రసాద్, కోశాధికారి ఎం.సత్యనారాయణ, సభ్యులు బాలకృష్ణ, బాలు, ఈశ్వరరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
విశాఖపట్నం
బుధవారం 3 జనవరి 2018

నరకయాతన

గుంతలమయమైన గుంటసీమ రహదారి
ఇబ్బంది పడుతున్న గిరి'జనం'
స్పందించని అధికారులు, నేతలు

సమస్యాత్మకం



గున్నుగుడలో రాళ్లు తేలిన రోడ్డు



గున్నుగుడలో కోతకు గురైన రోడ్డు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ
మండలంలోని మారుమూల ప్రాంతం గుంటసీమ రోడ్డు కోతకు గురై, రాళ్ల తేలిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణానికి గిరిజనులు నానాయాతన పడుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని గిరిజనం వాపోతున్నారు. మండల కేంద్రం డుంబ్రిగుడ నుండి గుంటసీమ వరకు 16 కిలోమీటర్లు దూరం ఉండగా, ఈ రోడ్డుకు ఆనుకొని లైగండ, తూటంగి, గుంటసీమ, గుంటగన్నెల, రంగిలిసింగి, అరమ పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాలున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రోజూ వందలాది మంది రాకపోకలు సాగించే ఈ రోడ్డు, వర్షాల కారణంగా గుమ్మగుండ, వరిడి, డోమంగి, పిత్తగుడ వద్ద కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. జాకరవల జంక్షన్ గున్నుగుడ్ పరిడిలో రోడ్డు రాళ్లు తేలిపోయాయి. రోడ్డు పొడుగునా గుంతమయమై, వర్షాలు కురిసినప్పుడు ఆ గోతుల్లో నీరు చేరి ప్రయాణానికి ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. అనేక గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలకు అవసరమైన ఈ రోడ్డు దుస్థితిపై పలుసార్లు అధికారులు, నేతలకు విన్నవించినా పట్టించుకునే దిక్కులేదని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టి, రహదారి కష్టాలను తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న జంక్షన్ రోడ్డు



పరిడిలో కోతకు గురైన రోడ్డు


అలరించిన శ్రీకృష్ణ లీలలు

ప్రజాశక్తి- మునగపాక
సురభి నాటక సమాజం ప్రదర్శించిన శ్రీకృష్ణ లీలలు నాటకం విశేషంగా అలరించింది. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ 61వ జన్మదినం సందర్భంగా మంగళవారం నుండి మూడు రోజుల పాటు సురభి నాటకాలు మునగపాకలో ప్రదర్శిస్తున్నారు. అందులో భాగంగా తొలిరోజు శ్రీకృష్ణలీలలు నాటకాన్ని ప్రదర్శించారు. సినీ సెట్టింగ్‌లతో ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రేక్షకులకు అసౌకర్యం కలగకుండా టెంట్లు, కూర్చొని చూసే విధంగా ఒక సినిమా హాలు పక్కిలో ఓపెన్ ఆడిటోరియంలా కుర్చీలు ఏర్పాటు చేశారు.

నాటకం



132 ఏళ్లగా సురభి నాటకాలు : వెంకటేశ్వరరావు



దీనికి ముందు ప్రారంభ కార్యక్రమంలో సురభి నాటక సమాజం నిర్వాహకుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే 132 సంవత్సరాలుగా నాటకాలు కొనసాగిస్తున్న ఏకైక సంస్థ సురభి నాటక సమాజమని చెప్పారు. 1885లో కడప జిల్లాలో సురభి గ్రామంలో మెట్టమొదటి ప్రదర్శనగా కీచక వధా అనే నాటకంతో ప్రారంభమైన ఈ సంస్థ నేటి వరకు కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలోనే కాకుండా దేశ విదేశాల్లో కూడా సురభి నాటకాల ప్రదర్శన కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మిగతా నాటకాలు డైలాగులు ప్రధానంగా ఉంటాయని, సురభి నాటకాలు దృశ్యం ప్రధానం కొనసాగుతున్నాయని చెప్పారు. సురభి నాటకాలను కన్ను ఆర్పకుండా చూసే విధంగా ఆసక్తి కలిగిస్తాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుకూలంగా సరికొత్త టెక్నాలజీతో నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. క్రమ శిక్షణ, సమయపాలన కొనసాగించడంతో ఈ సురభి నాటకాలు విజయవంతంగా ఖ్యాతి పొందుతున్నాయని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా సురభి నాటకాలు ప్రోత్సహిస్తూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పెంటకోట రమణబాబు, కాండ్రేగుల చందు, నేమాల పూర్ణ, మునగపాక మండల కొణతాల అభిమానులు పాల్గొన్నారు.



జ్ఞాన ప్రదాతలు.. మహిళా ఉపాధ్యాయులు

దినోత్సవం



ప్రజాశక్తి - మద్దిలపాలెం, జిల్లా పరిషత్
అఆలు నేర్పిన దగ్గర నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకూ పాఠం చెప్పిన ప్రతిఒక్కరూ గురువే. గురువంటే మార్గదర్శి. ద గైడ్. ఓ వ్యక్తిని జీవనయానంలో ఉన్నత స్థానంలో నిలబెట్టడానికి ఆయనతో అక్షరాలు దిద్దించి, వెన్నంటి ఉండి అభివృద్ధికి దోహదపడేవారే ఆచార్యులు. వీరిలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర అమోఘమైనది, అనిర్వచనీయమైనది. భారతదేశంలో గురువంటే ఎలా ఉండాలో, శిష్యులపై ఎలాంటి ముద్రవేయాలో సర్వేపల్లి రాధాకృష్ణ, సావిత్రిబాయి పూలేలు ఆచరించి చూపారు. అందుకే గురువులంటే తొలుత వారే గుర్తుకు వస్తారు. ముఖ్యంగా నాటి కాలంలో అనేక ఒడుదుడుకులను, నిర్బంధాన్ని, వివక్షను ఎదుర్కొని కడదాకా నిలిచారు సావిత్రి బాయి పూలే. ఆమె పుట్టిన రోజును జాతీయ మహిళా ఉపాధ్యాయ

జిల్లాలో 5200 మంది సేవలు
నేడు జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం

దినోత్సవంగా యావత్తు దేశం జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో ఆమె గొప్పతనాన్ని, జిల్లాలోని మహిళా ఉపాధ్యాయినిల పరిస్థితిని తెలియజేసేదే ఈ కథనం.. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే చరిత్రలోకెక్కారు. తొలి మహిళా పాఠశాలను ప్రారంభించిన ఆమె గొప్ప విద్యాబోధన చేశారు. ప్రముఖ సంఘసేవకుడు జ్యోతిరావ్‌పూలే భార్యగా సమాజ సేవలో పాలు పంచుకున్నారు. సావిత్రిబాయి ఆ కాలంలో మహిళా విద్య గురించి ఎంతో తపించారు. దళితవర్గంలో పుట్టి తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొని బ్రిటిష్ వారి కాలంలో మహిళల హక్కుల కోసం పోరాడారు. ఆ కాలంలో స్త్రీలను బయటకు వెళ్లనిచ్చేవారు కాదు. కానీ సావిత్రిబాయి పూలే బాలికలకు విద్యాబుద్ధులు నేర్పేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చారు. అప్పటి ఛాందసులు ఆమెపై కుళ్లిన గుడ్లు, మాంసం, టమాటాలు, రాళ్లు విసిరి హింసించారు. అయినప్పటికీ జంకకుండా ధైర్యంగా విద్యాబోధన చేశారు. ఆమె భర్త పూర్తి అండగా ఉంటూ ప్రోత్సహించారు. దీంతో ఆమె దేశంలోనే మహిళల కోసం 1848లో తొలి పాఠశాలను ప్రారంభించి అక్కడే మొదటి ఉపాధ్యాయినిగా పాఠాలు బోధించారు. మొదట వివిధ కులాలకు చెందిన తొమ్మిది మంది బాలికలు ఆమె పాఠశాలలో చేరి చదువుకున్నారు. ఆ తర్వాత సమాజంలో కొంత మార్పు వచ్చి తల్లిదండ్రులు తమ అమ్మాయిలను చదువుకునేందుకు పాఠశాలకు పంపించడం ప్రారంభించారు. దీంతో సావిత్రిబాయి మహిళల కోసం మరో ఐదు పాఠశాలలను ప్రారంభించారు. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్‌లాంటి దళిత కులాలకు చెందిన చిన్నారులను చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి 1897 మార్చి 10న మృతిచెందారు. ఇంతలా స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేసిన ఆమెను చివరకు బ్రిటిష్ ప్రభుత్వమే ఘనంగా సత్కరించడం విశేషం. సావిత్రిబాయి పూలే జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రతి ఏటా జరుపుకుంటున్నాం.

జిల్లాలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర

జిల్లాలో మొత్తం 13 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అందులో 5200 మంది మహిళా ఉపాధ్యాయులు. 40 శాతంగా ఉన్న వీరు జిల్లా విద్యాభివృద్ధిలో ఎనలేని కృషి చేస్తున్నారు. ముఖ్యంగా టెన్త్‌లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి అదనపు సమయాన్ని కూడా వెచ్చించి విద్యాబోధన చేస్తున్నారు. మరోపక్క పాఠశాలలో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా అగ్రభాగాన ఉంటూ మొత్తం భారాన్ని తమపై వేసుకుంటున్నారు. మహిళా విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటూ మానసికంగా వారు ఎదగడానికి దోహదపడుతున్నారు. ఇటు ప్రయివేటు విద్యాసంస్థల్లోనూ వీరి పాత్ర గొప్పదనే చెప్పాలి.



విద్యను కళాత్మకంగా తీర్చిదిద్దడంలో వారిదే కీలకపాత్ర



విద్యను కళాత్మకంగా తీర్చిదిద్దడంలో మహిళా ఉపాధ్యాయులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఓర్పుతో, సహనంతో మెలుగుతూ మంచి ఉత్తీర్ణత కోసం తోడ్పాటు అందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 40 శాతం మంది మహిళా ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

- బి.లింగేశ్వరరెడ్డి,
జిల్లా విద్యాశాఖాధికారి

నిత్య స్ఫూర్తి సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి పూలే దేశంలో స్త్రీ విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. ఆమె స్ఫూర్తితో నేడు అనేక మంది మహిళలు ఉన్నత విద్యలభ్యసిస్తున్నారు. పురుషులతో సమానంగా అనేక బాధ్యతాయుతమైన విధులు నిర్వర్తించడానికి ముందుకు వస్తున్నారు. అయినప్పటికీ స్త్రీ అణచివేతకు గురవుతూనే ఉంది. ముఖ్యంగా గ్రామీణ మహిళల్లో అక్షరాస్యతా శాతం పెరగాల్సిన అవసరముంది. మనకు ప్రథమ గురువు అమ్మే అంటారు. అలాంటి అమ్మలు పూర్తిగా విద్యావంతులవ్వాల్సిన అవసరముంది. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల మహిళలు చదువులకు దూరంగా ఉంటున్నారు. కేవలం అక్షరాస్యతతోనే సరిపోదు. ఉన్నత విద్యలందుకోవాలి. అటువంటి అవకాశాలను ప్రభుత్వాలు కల్పించాలి. కేవలం విద్యతోనే మహిళలు దేన్నైనా సాధించగలరు. దేశంలో పురుషులతో సమానంగా ఉన్న స్త్రీలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచాల్సిన అవసరముంది. స్త్రీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి.

- ఆచార్య ఎం.నళిని,
పొలిటికల్ సైన్స్ విభాగం సీనియర్ ఆచార్యులు,
ఆంధ్ర యూనివర్సిటీ

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



విద్యార్థినుల కోలాటం

ప్రజాశక్తి- నక్కపల్లి
నక్కపల్లిలో మంగళవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో చిన్నారుల నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది. సంక్షేమ పథకాలపై చెప్పిన బుర్ర కథ ఆలోచింపజేసింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పలు గీతాలకు నృత్యం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులను పలువురు అభినందించారు.

వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు

మత్స్యశాఖ, వ్యవసాయశాఖ, ఐసిడిఎస్, ఉపాధి, వెలుగు, నీటిపారుదల శాఖ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి యనమల రామకృష్ణుడు పరిశీలించారు. చంద్రన్న కానుకాలను లబ్ధిదారులకు అందజేశారు.

చిన్నారులకు అన్నప్రాసన్న

ఐసిడిస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో చిన్నారులకు ఎమ్మెల్యే అనిత, జెసి సృజన అన్న ప్రాసన చేశారు. బాలింతలకు, గర్భిణులకు అందజేస్తున్న పోషకాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ చిన్మయిదేవి, పిఒ శారదాదేవి, సూపర్ వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రైతు రథాలు పంపిణీ

నియోజకవర్గంలోని రైతులకు రైతు రథాలను (ట్రాక్టర్‌లను) ఎమ్మెల్యే అనిత రైతులకు అందజేశారు. వ్యవసాయాశాఖ అధ్వర్యంలో సబ్సిడీతో కూడిన 66 ట్రాక్టర్లను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థినుల స్వాగత నృత్య ప్రదర్శన



గర్భిణులను సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన స్టాల్



రైతు రథంపై ఎమ్మెల్యే అనిత

రహదారుల సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా

ప్రజాశక్తి- మాడుగుల

అర్థాంతరంగా ఆగిపోయిన రహదారి నిర్మాణంతో ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందుపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎంఎల్ఎ బూడి ముత్యాలనాయుడు అన్నారు. శంకరం పంచాయతీ కృష్ణంపాలెం గ్రామ రహదారి నిర్మాణం మధ్యలో నిలిచిపోవడాన్ని ఆ గ్రామప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో, మంగళవారం ఆయన రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎంతో అవసరమైన రహదారి నిర్మాణం నిలిచిపోవడం సరికాదన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కృష్ణంపాలెం రహదారితోపాటు, ఎంగదబూరు రహదారికి ట్రైబల్ సబ్‌ప్లాన్ ద్వారా రూ.1.10 కోట్లు మంజూరు అయ్యాయని, అయితే కంట్రాక్టరు కొంతవరకు పనులు చేసినా బిల్లులు విడుదల కాకపోవడంతో పని



రహదారి రక్షణగోడ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మధ్యలో వదలేశాడన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో జాప్యం వల్లే ఈపరిస్థితి తలెత్తిందన్నారు. నిధులు విడుదల చేయాలని ఉన్నతాధికారులతో వెంటనే మాట్లాడతానని, అవసరమైతే అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ప్రజలకు హామీనిచ్చారు.

నిధులు మళ్లింపు వల్లే కూలీలకు అందని ఉపాధి బిల్లులు

ఉపాధి నిధులను ఇతర పనులకు మళ్లించడం వల్లే కూలీలకు సకాలంలో వేతనాలు అందని పరిస్థితి నెలకొందని ఎమ్మెల్యే బూడి అన్నారు. కూలీలతో చేయించాల్సిన పనులను యంత్రాలతో చేపట్టడం విచారకరమని, నెలల తరబడి ఉపాధి బిల్లులు చెల్లించకపోతే కూలీల కుటుంబపోషణ ఎలా సాగుతుందన్నారు. దీనిపై వైసిపి కేంద్రానికి ఫిర్యాదు చేస్తే, విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నీరుచెట్టు పనుల్లో అనేక అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని బూడి ఆరోపించారు. ఆయన వెంట పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజుతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

ఎమ్మెల్యే రాజుకు కలెక్టర్ పరామర్శ

ప్రజాశక్తి - చోడవరం

ఇటీవల మాతృవియోగం పొందిన చోడవరం ఎంఎల్ఎ రాజును ఆయన స్వగృహంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. జన్మభూమి మావూరు కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా విచ్చేసిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, గ్రామసభల అనంతరం చోడవరంలోని ఎంఎల్ఎ ఇంటికి వెళ్లి పరామర్శించి, సంతాపాన్ని తెలిపారు. ఆయనతో పాటు మండలస్థాయి అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కేన్సర్ వైద్యశిబిరం

ప్రజాశక్తి- మాడుగుల

మండల కేంద్రంలో బుధవారం క్యాన్సర్ వ్యాధి ఉచిత పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వేమవరపు పెదబాబు తెలిపారు. స్థానిక శ్రీనివాస ఆసుపత్రి వైద్యులు శ్రీనివాస్ ఇంటి ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విశాఖపట్నం మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించే శిబిరంలో ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు.



వంటసామాగ్రి అందిస్తున్న ఎంపిపి కుచ్చు కళావతి

అంగన్వాడీలకు వంటసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - చీడికాడ

మండలంలోని చుక్కపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి ఎంపిపి కుచ్చు కళావతి ప్రభుత్వం సరఫరా చేసిన వంట సామగ్రిని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ 14వ ఆర్థికసంఘం నిధులతో గ్యాస్ స్టౌ, కుక్కర్, గ్లాసులు, కంచాలు తదితర సామాగ్రి అందించామన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు చిన్నారులకు వండి పెట్టడానికి సరిపడా సౌకర్యాలు లేకపోవడంతో ఇంతకాలం ఇబ్బందులు పడేవారని, వీటి పంపిణీతో వారి కష్టాలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో తహాశీల్దార్ పి.భాగ్యవతి, రెడ్డి సన్యాసినాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్య సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అరకు రూరల్

అరకులోయ గిరిజన మ్యూజియం ఆవరణలో ఉన్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, పాడేరు ఐటిడిఎ పిఒ రవిసుభాష్ పట్టన్‌శెట్టి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన మ్యూజియం నిధుల నుంచి రూ.50 లక్షలతో షాపింగ్ కాంప్లెక్సును నిర్మించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ప్రభాకర్, సర్పంచ్ గులాబి, ఎంపిపి అరుణకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వేణుగోపాలరావు, వైస్ ఎంపిపి అమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు బస్సుల నిర్వహణలో శ్రద్ధ వహించాలి



ఫోటోనెట్.. విషదీప్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న

ప్రజాశక్తి - కె.కోటపాడు

స్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిఎస్ఎన్ ట్రస్ట్ చైర్మన్ గవిరెడ్డి సన్యాసినాయుడు అన్నారు. గుల్లేపల్లికి చెందిన విషదీప్ వేణువిద్యానికేతన్‌లో విద్యనభ్యసించి సోమవారం ఇంటికి తిరిగివస్తుండగా ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బాలుని కుటుంబ సభ్యులను ఆయన మంగళవారం పరామర్శించారు. విషదీప్ తండ్రి శ్రీనివాసరావును ఓదార్చి, సంతాపాన్ని తెలిపారు. తనవంతుగా రూ.5 వేలు నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఏర్పాటు చేసిన బస్సులలో అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించడంతో పాటు విద్యార్థులను బస్సు ఎక్కించి, దించేందుకు ప్రత్యేకంగా హెల్పర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రయివేటు పాఠశాలల బస్సులను పర్యవేక్షించి, స్కూల్ యాజమాన్యాలకు సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గేదెల జగన్నాథం, మాజీ జెడ్‌పిటిసి కశిరెడ్డి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ బండారు రామస్వామిపాత్రుడు, పోస్టుమాస్టర్ రాళ్లపల్లి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



టెట్ సబ్జెక్టు పుస్తకాలు చూపుతున్న కన్నబాబు

గ్రంథాలయంలో డిఎస్‌సి, టెట్ పుస్తకాలు

కొత్తకోట : కొత్తకోట శాఖ గ్రంథాలయంలో టెట్‌కు సంబంధించి అన్ని సబ్జెక్టులు కొత్త సిలబస్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని లైబ్రేరియన్ ఆర్.కన్నబాబు తెలిపారు. త్వరలో ప్రభుత్వం నిర్వహించనున్న టెట్, డిఎస్సీ పోటీపరీక్షలకు సిద్ధపడే నిరుద్యోగ అభ్యర్థులకు అందుబాటులో ఉండేలా వీటిని ఉంచుతామన్నారు. ఐఐటి , జెఇఒ, మెయిన్స్‌కు సంబంధించిన ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలు కూడా గ్రంథాలయంలో ఉంచామన్నారు. నిరుద్యోగ యువకులు కోసం మధ్యాహ్నం సమయంలో మరో గంట పాటు అదనంగా శాఖ గ్రంథాలయాన్ని తెరిచి ఉంచుతున్నట్లు కన్నబాబు తెలిపారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

కొత్తకోట : ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను పాఠశాల విద్యార్థులు సద్వినియో గం చేసుకోవాలని రావికమతం ఎంపిపి డి.రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపియుపి పాఠశాల(ఆశమ్మబడి)లో 70 మంది విద్యార్దులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట నీలవేణి, పాఠశాల హెచ్ఎం చెల్లునాయుడు, నాయకులు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత రుణమాఫీకి నిధులేవి?

ప్రజాశక్తి- మాడుగుల

మూడో విడత రుణమాఫీ అమలు ఆర్భాటమే తప్ప, ఆచరణకు నోచుకోవడం లేదని ఎపి జాయింట్ ఫార్మింగ్ కోపరేటివ్ సొసైటీస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దండి సన్యాసయ్య దొర ఆరోపించారు. మంగళవారం మాడుగులలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రుణమాఫీ పత్రాలు ఆర్భాటంగా ప్రారంభించి, రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు రుణమాఫీ నిధులు విడుదల కాలేదన్నారు. ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని రెండవ తేదినుండి ప్రారంభం అవుతున్న జన్మభూమి కార్యక్రమంలో రుణమాఫీ పంపిణీ చేస్తామని మంత్రులు ప్రకటిస్తుంటే, దీనికి విరుద్ధంగా జన్మభూమి కార్యక్రమాలలో ఎటువంటి రుణమాఫీ పంపిణీ కాలేదన్నారు. మూడో విడత రుణమాఫీ ఎప్పుడు అమలు అవుతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని,



రుణమాఫీ పత్రాలు చూపుతున్న సన్యాసయ్య దొర

ఇప్పటివరకు నిధులు విడుదల కాకపోవడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యపు పనితీరుకు నిదర్శనమన్నారు. సమావేశంలో తాటిపర్తి మాజీ సర్పంచ్ అల్లంగి సంజీవి, ముకుందపురం వైస్ సర్పంచ్ కర్రి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న వామనమూర్తి

ఆర్ఎంపి డాక్టర్లకు రిజిస్ట్రేషన్ పత్రాలు

వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వామన మూర్తి ఆధ్వర్యాన స్థానిక ఆయుర్వేద ఆసుపత్రిలో మండల ఆర్ఎంపి డాక్టర్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్ఎంపి డాక్టర్స్ అందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలు మంజూరు చేశారు. అనంతరం వామనమూర్తి మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రి వద్ద పేరు ముందు డాక్టర్ అని, పేరు వెనుక మన అర్హత గాని ఉండకూడదని, అది చట్టరీత్యా నేరమన్నారు. ప్రాథమిక ప్రథమ చికిత్స కేంద్రం అని నేమ్ బోర్డు పెట్టాలని సూచించారు. మాజీ ఎంపిపి బత్తుల తాతయ్యబాబు, స్టేట్ ప్రెసిడెంట్ నారా ప్రసాద్, సెక్రటరీ బెన్నబాబు, కమిటీ సభ్యులు శ్రీరామ్మూర్తి, పెంటబాబు, డి.నూకరాజు పాల్గొన్నారు.

'మాతోట'తో గిరిజనులకు ఆర్థిక ఆసరా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- మాడుగుల

మాతోట పథకం ద్వారా గిరిజనులకు ఉపాధి దొరుకుతుందని ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు అన్నారు. మంగళవారం శంకరం పంచాయతీ రామచంద్రాపురం వద్ద నాబార్డు నిధులతో నిర్మించనున్న పశువుల షెడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభ్యుదయ సంస్థ ద్వారా అమలు అవుతున్న మాతోట పథకంలో వివిధ తోటలు వేసుకుని గిరిజనులు ఉపాధి పొందుతున్నారన్నారు. గిరిజనులు అభివృద్ధి చెందని మారుమూల ప్రాంతాలలో నాబార్డు ఇటువంటి పథకాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాబార్డు ఎజిఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మాతోట పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. నాబార్డు ఆర్థిక సహాయంతో వారి భూములలో జీడి, మామిడి వంటి తోటలు వేసుకుని ఫలసాయం అమ్మకం ద్వారా జీవనం సాగించేందుకు పథకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామభ్యుదయ సంస్థ నిర్వాహకులు కరణం త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు లారీల రవాణాపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- పరవాడ

పరవాడ మండలం మీదుగా ప్రైవేట్ పరిశ్రమలకు లారీల ద్వారా రవాణా అవుతున్న బొగ్గు మూలంగా మండలంలోని 20 గ్రామాలకు పైగా మసిబొగ్గులుగా మారుతున్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని అఖిలపక్ష పోరాట కమిటి సభ్యులు మంగళవారం పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్దంగా భారీ వాహనాలు తిరగడం వల్ల రోడ్లు పూర్తిగా నాశనమయ్యాయని చెప్పారు. వీటి నుండి రాలిపడిన బొగ్గు దూళి అటు వ్యవసాయం చేసుకునే పంట పొలాలు, రోడ్లకు ఇరువైపుగా ఉన్న సరుగుడు, యూకలిప్టస్, జీడిమామిడి, కూరగాయలు, ఆకు కూరలు పండించే రైతుల పొలాలు అన్ని ఈ బొగ్గుదూళితో నిండిపోయి పంటలన్ని సర్వనాశనం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పోరాట కమిటి కన్వీనర్ పి.మాణిక్యం, వైసిపి నాయకులు పైలా హరీష్, బి చిన్నారావు, జనసేన సేవాదళ్ సభ్యులు బి.శ్రీనివాస కాసులు, ఎన్.సన్యాసినాయుడు, కాంగ్రెస్ నాయకులు కెఎస్ఎ రామయ్యానాయుడు, కె.రామారావు, లంకెలపాలెం మాజీ ఎంపిటిసి సుందరపు అప్పారావు, గ్రామ పెద్ద వైవి నర్సింహం, సిపిఎం నాయకులు వివి శ్రీనివాస్, ఎస్ఎస్ రాజు, సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి : పట్టణంలోని దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సిపిఎం నాయకులు విడుదల చేశారు. సిపిఎం నాయకులు ఎ బాలకృష్ణ మాట్లాడుతూ జనవరి 6 నుండి 8 వరకు అచ్యుతాపురంలో జరగనున్న సిపిఎం పార్టీ 22వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక సంఘం నాయకుడు మళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్ఇజెడ్‌లో కార్మికుల ప్రయోజనాల కోసం చట్టాల అమలు కోసం సిపిఎం అనేక ఉద్యమాలు ద్వారా విజయాలు సాధించిందన్నారు. కౌలు రైతు సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు మాట్లాడుతూ 6వ తేదీ అచ్యుతాపురం జంక్షన్‌లో జరిగే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి మహాసభలు జయప్రదం చేయాలని కోరారు.పెంటకోట జగన్నాధం,ఎం.బాస్కరరావు పాల్గొన్నారు.

60వేల మొక్కలు పంపిణీకి చర్యలు

అనకాపల్లి : ఈ ఏడాది 60వేల మొక్కల పంపిణీకి సిద్దంగా గ్రీన్ క్లబ్ పని చేస్తుందని క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న వినాయక ఆలయం వద్ద గ్రీన్‌క్లబ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం పరిశుభ్రత, పచ్చదనం కోసం పట్టణ పరిధిలో పని చేస్తున్న పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ, మాజీ ఫారెస్ట్ రేంజ్ బీరా వినోద్‌కుమార్, క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెంటకోట ఉమామహేశ్వరరావు, కొడమంటిలి వెంకట శివాజీ, కొయిలాడ వెంకట శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఆందోళన

అనకాపల్లిటౌన్ : డిపోలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎపిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ సెక్రటరీ ఎఎస్ పాత్రుడు మాట్లాడుతూ కొద్ది రోజులుగా కార్మికులకు సెలవులు, 20శాతం హెచ్‌ఆర్ ఎరియర్స్ ఇవ్వలేదని చెప్పారు. ప్రతి కార్మికునికి రెండు రోజుల సెలవులు విధిగా ఇప్పించి ఎడిసిలు విధిగా చేయాలన్నారు. వాహనాల కండీషన్ మెరుగు పర్చాలని మెకానిక్స్ వద్ద శ్రామిక్స్‌ను వేయాలని డిమాండ్ చేశారు. అధికారులు యూనియన్ పక్షపాత వైఖరి విడనాడి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎన్ మూర్తి, వైవిఎస్ కుమార్, కెకె కుమారి, గ్యారేజ్ కమిటి ఆర్‌వి రమణ, యు రమణ, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు రూ.1500 పింఛను ఇవ్వాలి

అనకాపల్లి : వికలాంగులకు రూ.1500 పింఛను ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం మండల కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో వికలాంగులకు 5శాతం ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అద్దె ఇళ్లలో ఉన్న వికలాంగులకు 3సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి గృహాల నిర్మాణానికి రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాగారపు సత్యం, షేక్ రహమాన్, రాపేటి భాస్కరరావు, బుద్ద ధనలక్ష్మి పాల్గొన్నారు.

జన్మభూమిలో అధికారులను నిలదీత

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

గత జన్మభూమిలో దరఖాస్తు చేసుకున్న పింఛన్, రేషన్ కార్డులు ఇంకా మంజూరు కాలేదని, అవి ఎప్పుడు మంజూరు చేస్తారని మండలంలోని భట్లపూడి, అక్కిరెడ్డిపాలెం, గోపాలపురం గ్రామస్తులు మంగళవారం జరిగిన జన్మభూమి సభల్లో అధికారులను ప్రశ్నించారు. దరఖాస్తు చేసుకొని ఏడాది అయినప్పటికీ నేటికి రేషన్ కార్డులు గాని, పించన్లు గాని అర్హులకు మంజూరు కాలేదన్నారు. వాటి సమస్య పరిష్కారం కాకుండానే మళ్లీ జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల ఉపయోగం ఏమిటని గోపాలపురం సర్పంచ్ గొర్లి సూరిబాబు అధికారులను నిలదీశారు. వికలాంగులైన గొర్లి త్రివేణి, జెర్రిపోతుల ప్రియా, గత జన్మభూమిలో పించన్లు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ నేటికి మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భట్లపూడి గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్య ఉందని ప్రజలు అధికారులను నిలదీశారు. దీనికి స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి విజయలక్ష్మి సమస్య తీవ్రతను గుర్తించి ఇంటికి ఒక తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ బివి రమణ, డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్మూర్తి స్పందిస్తూ ఉగాది నాటికి అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తామని తెలిపారు.


అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు


కానుకలు పంపిణీ చేస్తున్న జన్మభూమి సభ్యులు

చంద్రన్న కానుకలు పంపిణీ

సబ్బవరం : మండలంలోని పెదగొల్లలపాలెం గ్రామంలో మంగళవారం జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు జన్మభూమి కమిటి సభ్యుడు మోపాడ గంగరాజు ఆధ్వర్యంలో చేతుల మీదుగా చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. సంక్రాంతిని పురష్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికి చంద్రన్న కానుకలు పంపిణీ చేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గొల్లవిల్లి రమణ, పెచ్చెట్టి అప్పారావు, సాలాపు ఈశ్వరరావు, కందుల లక్ష్మి పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాలలో స్వచ్ఛభారత్

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో మంగళవారం స్వచ్ఛభరత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజేపి యువమోర్చ జాతీయ నాయకులు ఆడారి కిషోర్, పట్టణ అధ్యక్షులు కోలపర్తి శ్రీను మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో స్వచ్ఛ్‌భారత్‌ను చేపట్టారు. ఈ కార్యక్రమంలో కోరిబిల్లి కుమారరాజా, బుద్ద పాండు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎవి బ్రహ్మానందం పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విశాఖ : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని 4వ పట్టణ ట్రాఫిక్ సిఐ దుర్గా ప్రసాద్ కోరారు. శంకర మఠం రోడ్డు వద్ద మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్సు లేనివారు, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదుచేశారు. వాహనదారులకు ట్రాఫిక్‌పై ఆయన పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ భరత్‌కుమార్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి


వినతి ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కశింకోట

మండలంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని బహుజన సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గుజ్జం జాఘువ కాలనీలో పేదల పాకలు తీసేస్తున్నారని దానివల్ల నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిరుపేదలకు ఇళ్లను, ఇళ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. రామన్నపాలెం ఏలేరు కాలువ వద్ద ఉన్న కాజేవు(బిడ్జి) కొట్టుకుపోయిందని దానిని నిర్మించకపోవడం వల్ల గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంపి దత్తత గ్రామం తాళ్లపాలెం మేజర్ పంచాయితీలో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని ఆ సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్‌వాదీ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు, బి శ్రీనివాసరావు, ఆర్ పూర్ణారావు, రామచంద్రరరావు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం

అనకాపల్లి : డిజిటల్ లావాదేవీలపై బ్యాంకు వినియోగదారులు అవగాహన పెంచుకోవాలని ఎస్‌బిఐ గవరపాలెం బ్రాంచి మేనేజర్ కె.రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం గౌరీ గ్రంథాలయంలో జరిగిన డిజిటల్ బ్యాంకింగ్–సేవలు–రుణాలు అంశంపై అవగాహన కల్పించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న సేవలు, ప్రధాన మంత్రి అవాస్ యోజన, బీమా పథకాలను మేనేజర్ రవీంద్రకుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధ్యక్షుడు శరగడం శ్రీరామకృష్ణ, గ్రంధాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ(ఎస్ఎఫ్ఐ), కాండ్రేగుల జగ్గాగరావు, మళ్ల బాపునాయుడు, బొడ్డేడ జగ్గ అప్పారావు, బి.అప్పలనరసయ్య, బిఆర్ఎస్ అప్పలస్వామినాయుడు, ఖాతాదారులు పాల్గొన్నారు.

జన్మభూమిలో గర్భిణులకు సీమంతాలు

కశింకోట : మండలంలోని చెరకాం, భీమవరం గ్రామాల్లో జన్మభూమిలో భాగంగా మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలకు చీరలు, ఇతర అలంకరణలు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మలసాల ధనమ్మ, ఎంపిపి పంచదార్ల లక్ష్మి, జన్మభూమి మండల ప్రత్యేక అధికారి గీతాదేవి, ఐసిడిఎస్ పిఒ కెఎంఎల్‌కె కుమారి, సర్పంచ్ చిటిమిరెడ్డి మహాలక్ష్మి, పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో బుధవారం భారత దేశ మెట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని మహాత్మ జ్యోతిబాయిపూలే సతీమణి, సావిత్రిభాయి పూలే జయంతిని మంగళవారం యువతా మేలుకో స్వచ్చంద సంస్థ, కశింకోట హౌసింగ్ కాలనీకి చెందిన దివెల్ఫేర్ సొసైటీ ఆఫ్ పూలే అంబేద్కర్ సంస్థలు సంయుక్త ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కశింకోట ఇన్‌చార్జి సబ్ ఇస్పెక్టర్ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ, సంస్థ కన్వీనర్స్ ఎన్‌పి చంద్రశేఖర్, విఎ రాజు, ఫణీంధ్రల చేతుల మీదుగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం మాట్లాడారు. సావిత్రిభాయి పూలే వంటి మహున్నత మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమ నిర్వాహకు ఆర్థికంగా సహకరించిన జాజుల రమేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ది వెల్ఫేర్ సొసైటీ ఆఫ్ పూలే అంబేద్కర్ కన్వీనర్ విఎ రాజు, ఆడారి నాగేష్, జగన్, లక్ష్మణ్, నాని, సన్ని, రాజేష్, అజయ్, అవినాష్, గణేష్, పాఠశాల యాజమాన్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రమాదంపై విచారణ చేయాలి

పరవాడ : కోరీ ఆర్గానిక్స్ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పరవాడ ఫార్మాసిటిలో కోరీ ఆర్గానిక్స్ పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలనే కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా పరిశ్రమలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు చేపట్టవలసిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుల వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వం ఫార్మా పరిశ్రమలపై ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడిగా కమిటీలు వేయడమే తప్ప కార్మికులకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై శ్రీను, కె వెంకునాయుడు, బి రాము, వి చిన్నారావు పాల్గొన్నారు.

'జన్మభూమి'కి 56 దరఖాస్తులు

కశింకోట : మండలంలోని జి.భీమవరం జన్మభూమి కార్యక్రమంలో మంగళవారం 56 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ కె జ్ఞానవేణి తెలిపారు. వీటిలో స్కీమ్‌ల కోసం 12, ఐఎస్–ఎల్ఎస్ 12, జలసిరికి 3, ఇళ్లస్థలాకు 15, రేషన్ కార్డులకు 2, పించన్లకు 7, లోన్ల కోసం 4 దరఖాస్తులు అందాయని ఆమె తెలిపారు. వీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

పరీక్షల్లో పట్టు సాధించేందుకు అవగాహన

వ్యక్తిత్వ వికాస నిపుణులు మహర్షి సాగర్

ఎస్.రాయవరం : పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అంటే భయమని, ఆ భయాన్ని విడనాడి పరీక్షల్లో పట్టు సాధించే దిశగా ఏయే అంశాలు ప్రభావితం చేస్తాయనే అంశంపై అవగాహన అవసరమని వ్యక్తిత్వ వికాస నిపుణులు మహర్షి సాగర్ తెలిపారు. గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మంగళవారం సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లోని భయాలు, సందేహాలను నివృతి చేశారు. ముందుగా విద్యార్థులకు ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తే వారికి ఆయా సబ్జెక్టులపై పట్టు వస్తుందన్న అంశాన్ని ఉపాధ్యాయులకు తెలిపారు. తదుపరి ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు, చదివిన అంశాలు ఏ విధంగా గుర్తు పెట్టుకొని పరీక్షలు రాయాలో విద్యార్థులకు సోదాహరణంగా వివరించారు. ఎక్కువ మార్కులు సాధించేందుకు విద్యార్థులు చేయాల్సిన, పాటించాల్సిన పద్ధతులను వివరించి, వారిలో పరీక్షల పట్ల ఉన్న అభద్రతా భావాన్ని పోగొట్టారు. కార్యక్రమం అనంతరం విద్యార్థినులు తమలో ఆత్మస్థైర్యం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి ఎం.చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓర్పు నేర్పు విజయానికి సోపానాలు

నక్కపల్లి : చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఓర్పు, నేర్పు, విజయ సాధనం ద్వారా ఇది సాధ్యమని సర్వశిక్షాభియాన్ సైకియాట్రిస్ట్ మహర్షిసాగర్ అన్నారు. మండలంలోని మంగళవారం కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ విద్యార్థికి ఆయుధం వంటిదన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ ప్రత్యేక అధికారి, విమలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎస్.రాయవరంలో అవగాహన కల్పిస్తున్న సాగర్

రైతులకు హెరిటేజ్ బోనస్ పంపిణీ

అచ్యుతాపురం : మండలంలోని వెదురువాడ గ్రామంలో హెరిటేజ్ పాడి రైతులకు సంక్రాంతి బోనస్ 55 మంది రైతులకు లక్షా 58వేల రూపాయలు హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు చేతుల మీదుగా పంపిణీ చేశారు. పాడి రైతులు కష్టసుఖాలను ఆలోచించి ఇన్సూరెన్స్ ప్రిమియం తగ్గించినట్లు తెలిపారు. బైరాగి రాజు, నర్సింగమూర్తిరాజు పాల్గొన్నారు.

జన్మభూమిని విజయవంతం చేయాలి

ఎస్.రాయవరం : జన్మభూమిని విజయవంతం చేయాలని తహశీల్దార్ కె.వేణుగోపాల్ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రామంలో తలయారీ, రేషన్‌డీలర్, గ్రామస్తులను సమన్వయ పరచుకొని చంద్రన్న కానుకలు, రేషన్‌కార్డుల పంపిణీని చక్కబెట్టాలన్నారు. జన్మభూమిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి, డేటా ఎంట్రీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిటి ఇ.శ్రీనివాస్, ఆర్ఐ నానాజీ, విఆర్ఓలు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

అచ్యుతాపురం : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఎపిటిఎఫ్) – 2018 డైరీని శాసన మండలి సభ్యులు పప్పల చలపతిరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో విద్యకు అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తున్నందున పాఠశాలను బలోపేతానికి తగిన కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొత్స వెంకటేశ్వరరావు, త్రినాధస్వామి, రాష్ట్ర కౌన్సిలర్‌లు గంగాధర్, ఫాతిమా మోబిన్ బేగ్, సంఘ సభ్యులు సన్నిబాబు, రమేష్, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, కె.రమేష్, అప్పలనాయుడు, మణికుమార్ పాల్గొన్నారు.

అఖండ హరినామ సంకీర్తనలో భజన బృందాలు



ఎస్.రాయవరం : మండలంలోని వేమగిరి, ధర్మవరం అగ్రహారం గ్రామాలకు చెందిన భజన బృందాలు తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన కార్యక్రమంలో పాల్గొన్నట్లు వేమగిరి సర్పంచ్ పోతు రంగారావు మంగళవారం తెలిపారు. తిరుమలలో ధర్మవరం, వేమగిరి భజన బృందాలు పాల్గొన్నట్లు తెలిపారు.


సిపిఎం నాయకులను అరెస్టు చేస్తున్న ఎస్ఐ

సిపిఎం నాయకుల ముందస్తు అరెస్ట్

నక్కపల్లి : సిపిఎం నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. నక్కపల్లిలో జరిగే జన్మభూమికి మంత్రి యనమల రామకృష్ణుడు రావడంతో నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి సిద్ధమైన నాయకులను సిపిఎం కార్యాలయం వద్ద ఎస్ఐ పి.సింహాచలం తన సిబ్బందితో అరెస్టు చేశారు. వీరిలో నాయకులు ఎం.అప్పలరాజు, పి.వెంకటస్వామి, సత్యనారాయణ, దాసు ఉన్నారు. జన్మభూమి కార్యక్రమం ముగిసిన తరువాత విడుదల చేశారు.

ప్రజాస్వేచ్ఛ హరింపు : సిపిఎం

దీనిపై అప్పలరాజు మాట్లాడుతూ పాయకరావుపేట నియోజవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, నక్కపల్లిలో 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, అడ్డురోడ్డులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి సన్నద్ధమవుతుండగా, ఎస్ఐ తన సిబ్బందితో వచ్చి అరెస్టు చేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వేచ్ఛను హరించేవిధంగా నక్కపల్లి పోలీసులు వ్యవహరించారని విమర్శించారు. ఎస్ఐ పి.సింహాచలం మాట్లాడుతూ ఎటువంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ఉండేందుకు ముందస్తు అరెస్టు చేసినట్లు తెలిపారు.

భూములను జెసి పరిశీలన

నక్కపల్లి : మండలంలో భూ సేకరణ ప్రభావిత గ్రామంలో భూములను మంగళవారం జాయింట్ కలెక్టర్ సృజన పరిశీలించారు. విశాఖ–చెన్నై కారిడర్ పేరుతో ప్రభుత్వం పరిశ్రమల స్థాపన కోసం భూములను సేకరించింది. ఎపిఐఐసి అధికార్లు జిరాయితీ, డి పట్టా ప్రభుత్వ భూములను గుర్తించారు. ఈ మేరకు జెసి భూములను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాణి అమ్మాజీ, సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.


ప్రభుత్వ భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జెసి

బ్రిడ్జిని నాణ్యతగా నిర్మించాలి

అచ్యుతాపురం : అచ్యుతాపురం నుండి సెజ్ కాలనీకి వెళ్లే బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చెప్పారు. ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.22 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను మంగళవారం ఎమ్మెల్యేతోపాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని సందర్శించారు. సంబంధిత ఇంజనీర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు చేకూరి శ్రీనివాసరాజు, జెడ్‌పిటిసి సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యుడు ఎం.సంజీవి తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న పంచకర్ల, భవాని

పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి తీరుతాం

నియోజకవర్గ అభివృద్ధికి సాయం : మంత్రి యనమల

నక్కపల్లి : ఎన్ని వేల కోట్లు ఖర్చయినా పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి తీరుతామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. నక్కపల్లి జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం జరిగిన జన్మభూమి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. డిగ్రీ కళాశాల మంజూరు చేయాలంటే మంత్రి గంటా చేయాలని దీనికి నావంతు సహకారం అందిస్తానని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిత పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఏ కార్యక్రమం చేయాలన్నా డబ్బులు కావాలన్నారు. తను రాజకీయాల్లోకి వచ్చిన మొదట్లో ఊరు బాగుకోసం అడిగేవారని ఇప్పుడు వ్యక్తిగత సమస్యలు గురించి అడుగుతున్నారని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే రైతు, పేద వారి కళ్లలో ఆనందం చూస్తామన్నారు. ఒక పార్టీ పోలవరం ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేస్తున్నామంటే, మరో పార్టీ ప్రాజెక్టు పూర్తికాదని మాట్లాడుతున్నారని, చిత్తశుద్ధిలేని పార్టీలు రాష్ట్రంలో ఉన్నాయని వారి మాటల నమ్మవద్దని సూచించారు. అర్హులకు సంక్షేమ పథకాలను అందించనున్నట్లు తెలిపారు. ఇతర పార్టీల ప్రలోభాలకు లోనికావద్దన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని అందించేందుకు పాలసీని తయారు చేస్తున్నామని తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే వంగలపూడి అనిత మాట్లాడుతూ రూ.400 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన మంత్రి యనమలకు కృతజ్ఞతలు తెలియజేశారు. నక్కపల్లిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, బిసి హాస్టల్ మంజూరు చేయాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని మంత్రికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మేడేటి శంకర్ వినతిపత్రం అందజేశారు.

ఉత్తమ పంచాయతీలకు ప్రోత్సాహం

మండలంలో చినదొడ్డిగల్లు, జానయక్యపేట గ్రామాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక కావడంతో చినదొడ్డిగల్లు సర్పంచ్ వెలగా శ్రీనివాసరావునకు లక్ష రూపాయలు, జానయ్యపేట సర్పంచ్ కురందాసు నూకరాజుకు రూ.75వేల నగదును చెక్ రూపంలో అందించారు. పంచాయతీ కార్యదర్శులకు సెల్‌ఫోన్‌లు అందజేశారు.


నక్కపల్లిలో మాట్లాడుతున్న మంత్రి యనమల, చిత్రంలో ఎమ్మెల్యే అనిత

నోరు నొక్కారు

నక్కపల్లికి చెందిన కొల్నాటి అప్పారావు రైతు రుణమాఫీ సక్రమంగా చేయలేదని అడగటంతో పోలీసులు అక్కడ నుంచి లాక్కొని పోయారు. ఈ కార్యక్రమంలో జెసి సృజన, నర్సీపట్నం ఆర్‌డిఓ సూర్యారావు, సర్పంచ్ వీసం వెంకటలక్ష్మి, ఎంపిపిలు లావణ్య, వినోద్‌రాజు, జిల్లా పరిషత్ కో – ఆప్షన్ మెంబర్ కొప్పిశెట్టి కొండబాబు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, నాలుగు మండలాల ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, పార్టీ అధ్యక్షులు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఇఓఆర్‌డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధే ముఖ్యమని ఎంపిపి వినోద్‌రాజు అన్నారు. చిన్నగుమ్ములూరులో జన్మభూమి గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, అర్హులకు కార్డులు, పెన్షన్లు అందజేశారు. అనంతరం రామయ్యపట్నం, పెట్టుగోళ్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. రామయ్యపట్నంలో గృహ నిర్మాణ శాఖ ఎఇ కృష్ణ మాట్లాడుతుండగా గ్రామ సర్పంచ్ తీర్మానం లేకుండా లబ్దిదారుల ఎంపిక ఏ విధంగా చేశారంటూ సర్పంచ్ భర్త రాము నిలదీశారు. దీంతో కొద్దిసేపు ఇరు గ్రూపుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోగా, ఎంపిపి వినోద్‌రాజు గ్రామాభివృద్ధి కోసమే లబ్దిదారుల ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జెడి పి.శివప్రసాద్, ఎంపిడిఓ డిడి స్వరూపారాణి, తహశీల్దార్ కె వేణుగోపాల్, వ్యవసాయ శాఖ అధికారి ఉమా ప్రసాద్, ఎలక్ట్రికల్ ఎఇ మాంకాళరావు, ఆయా గ్రామ సర్పంచ్‌లు, అధికరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రమేష్‌బాబు చెప్పారు. వెదురువాడ, చోడపల్లి, మార్టూరు, గ్రామాల్లో జన్మభూమి జరిగింది. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు అవుతాయన్నారు. మార్టూరు గ్రామాన్ని అభివృద్ధి చేయడానికే తాను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 38 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు రూ.1200 చొప్పున ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.24 లక్షల రుణాలను అందజేశారు. 16 మందికి పింఛన్లు మంజూరు పత్రాలను అందజేశారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ లాలం భవాని మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి దశల వారీగా నిధులు మంజూరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు చేకూరి శ్రీనివాసరాజు, జెడ్‌పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాజాన రమేష్‌కుమార్, ఎంపిడిఓ పి.బలరాముడు, తహశీల్దార్ బి.రవికుమార్, గ్రామ సర్పంచ్‌లు గొర్లి లోవకుమారి, గుర్రం లక్ష్మి, ఈగల అప్పలనాయుడు, గొర్లి రామజోగి, పుర్రె శ్రీనివాసరావు, కెవి రమణ, మండల ఇంజినీర్ ఎస్.సోమశేఖర్, హౌసింగ్ ఎఇ ప్రసాద్, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ రంగనాయకులు, కెకె సీతారామరాజు పాల్గొన్నారు.


అచ్యుతాపురం మండలంలో..


ఎస్.రాయవరం మండలంలో...

ప్రజాశక్తి
నర్సీపట్నం 11
బుధవారం 03 జనవరి 2018

రూ.11.50 లక్షలతో గ్రంథాలయ పనులు

ప్రజాశక్తి- కోటవురట్ల

మండల కేంద్రంలోని గ్రంథాలయానికి మరమ్మతులు నిమిత్తం 11.50 లక్షలు మంజూరు అయినట్లు శాఖా గ్రంథాలయ అధికారి రాజుబాబు తెలిపారు. నిధులు మంజూరు కావడంతో సిబ్బంది పాఠకులు ఆనందం వ్యక్తం చేశారు .త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

వికలాంగుల సదరం క్యాంపు వాయిదా

నర్సీపట్నం : నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఈ నెల 5న జరగనున్న వికలాంగుల సదరం క్యాంపు వాయిదా వేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నర్సీపట్నం నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా సదరం క్యాంపు వాయిదా వేసినట్లు చెప్పారు. క్యాంపు జరిగే తేదీ తదుపరి ప్రకటిస్తామన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - గొలుగొండ


బోనస్‌లు ఇస్తున్న డెయిరీ అధికారులు

పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ పని చేస్తున్నదని విశాఖ డెయిరీ డైరక్టర్ చిటికెల రాజకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని అమ్మపేట , కంతారం గ్రామాల్లో వున్న విశాఖ డయిరీ పాల సేకరణ కేంద్రాల్లో పాడిరైతులకు ఆమె బోనస్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల శ్రేమస్సు కోసమే వడ్డీరాయితీపై రుణాలు, ఏడాదిలో 4సార్లు బోనస్సులను అందిస్తున్నామన్నారు. అనంతరం 145 మంది రైతులకు రు.2 లక్షల 45 వేలు బోనస్సులుగా అందజేశారు. అలాగే రాయితీపై పశు వులకు దాణాపెట్టేందుకు పాత్రలను ఆయె రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మపేట పాల సేకరణ కేంద్రం అధ్యక్షులు గొర్లి సత్యనారాయణ, రూటు సూపర్‌వైజర్ గంగేష్‌లుతో పాటుగా పలువురు రైతులు పాల్గొన్నారు.

వరి, అపరాల పైర్లకు సస్యరక్షణ

ప్రజాశక్తి- అనకాపల్లి

వరి మాగాని, అపరాలు పంటలకు అక్షింతల పురుగు సోకే అవకాశం ఉందని; రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్త ఎంబిజిఎస్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురుగు నివారణకు క్వినాల్ ఫాస్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. మొక్కజొన్న పంటకు కాండం తొలుచుపురుగు, ఆకు ఎండు తెగులకు ట్రైకోగామా గుడ్డు పరాన్న జీవులను ఎకరాకు 30వేలు చొప్పున విడుదల చేసుకోవాలని చెప్పారు.


మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

ప్రజలకు ఉపయోగపడని సభలెందుకు?

గొలుగొండ : ప్రజలకు ఉపయోగపడని జన్మభూమి సభలు నిర్వహణ ఎందుకని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామునాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మేకా సత్యనారాయణలు విమర్శించారు. మంగళవారం చోద్యం గ్రామంలో వారు విలేఖర్లతో మాట్లాడారు. గత జన్మభూమి సభల్లో ప్రజలు ఇచ్చిన సమస్యలను తీర్చలేని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ఎందుకు జన్మభూమి కార్యక్రమం చేపట్టిందో అర్థం కావడం లేదన్నారు. జన్మభూమికి కొత్త పింఛన్లు ఇస్తానన్న నాయకులు సభల్లో పింఛన్లు ఎందుకు ఇవ్వలేదని వారు ప్రశ్నించారు. సభల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం జన్మభూమిలో అధికారులదృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నల్లబెల్లి శ్రీనివాసు, చోద్యం శాకాసమితి కార్యదర్శి పోతల సత్యనారాయణలు పాల్గొన్నారు.

కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి : బిసి సంక్షేమ శాఖ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు కాజేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అవుట్ సోర్సింగ్ అండ్ కాంట్రాక్టింగ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆర్ దొరబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ బిసి సంక్షేమ శాఖలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు నాలుగు నెలలు ప్రభుత్వం చెల్లించినప్పటికీ కాంట్రాక్టర్ సిబ్బందికి ఆ జీతాలను చెల్లించకుండా వ్యాపారం చేసుకుంటున్నారని చెప్పారు. బిసి సంక్షేమ శాఖ అధికారులు జీతాలు చెల్లించమని చెప్పినా కాంట్రాక్టర్ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే సిబ్బంది జీతాలు చెల్లించాలన్నారు. లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని దొరబాబు హెచ్చరించారు.

చంద్రన్న బీమా సొమ్ము అందజేత

గొలుగొండ : మండలంలోని చోద్యం గ్రామంలో ఇటీవల మృతి చెందని చేతకాని నూకాలమ్మ భర్తకు సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ ఆదపురెడ్డి ప్రభాకర్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చంద్రన్న బీమా సభ్యులుగా చేరాలన్నారు. భీమా ఉంటే కుటుంబానికి ధీమా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి కమిటి సభ్యులు దేవాడ శేషు, భీమా మిత్ర శారద పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నం

మొదటి రోజు జన్మభూమి కార్యాక్రమం ప్రశాంతంగా జరిగింది. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 3, 4 వార్డులో మంగళవారం జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ చింతకాయల అనిత మాట్లాడుతూ నాలుగో తేదీ తర్వాత ఢిల్లీ బృందం పట్టణాలలో పర్యటిస్తుందన్నారు. కావున ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేసి సహకరించాలని కోరారు. అంతకు ముందు స్వచ్ఛ అవార్డు అనే అంశవంపై ప్రత్యేక బుర్ర కథ నిర్వహించారు. అనంతరం చంద్రన్న క్రిస్టమస్ కానుకలు, చంద్రన్న భీమా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, కమీషనర్ జె.సురేంద్ర, డిఇఇ రంగ కామేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు మాకిరెడ్డి విజయకుమారి, అప్పారావు, మామిడి అరుణ, లాలం వరహాలమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కానుకలు పంపిణీ చేస్తున్న అనిత

నర్సీపట్నం రూరల్‌లో... : జన్మభూమి 5 వ విడత కార్యక్రమము నర్సీపట్నం మండలం అమలాపురం పంచాయతీలో ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ గా సిహెచ్ మహాలక్ష్మి అమలాపురం పంచాయతీలోని కొత్తగా మంజూరైన27 రేషన్ కార్డులను పంపిణీ చేశారు. వీటితోపాటు పంచాయతీలోని 105 మంది విద్యార్థులకు స్కాలర్షిప్పులు, చంద్రన్న సంక్రాంతి కానుకలు అందిచారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఎంపిపి సుకల రమణమ్మ మాట్లాడుతూ ఎవరైనా వికలాంగులు సదరన్ సర్టిఫికేషన్ చేసుకోలేనివారు చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రులో ఏర్పాటు చేస్తున్న స్పెషల్ సదరన్ క్యాంపులో వికలాంగ ధ్రువపత్రాలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయా మాధవి, ఎమ్మార్వో విని రమణ, ఇఒపిఆర్‌డి సిహెచ్ ప్రేమలీల, వెలుగు ఏపిఎం సత్తిబాబు పాల్గొన్నారు.

కోటవురట్లలో... : పథకాల అమలులో జరుగుతున్న లోపాలను సరిదిద్ది అర్హులకు న్యాయ చేచేయాలని ప్రత్యేక అధికారి శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని అన్నివరం, చినబొడ్డపల్లి గ్రామాల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో రెండు టీమ్‌లుగా గ్రామాలకు చేరుకున్నారు. అన్నివరం గ్రామంలో ఎంపిపి వరహాలమ్మ, ఎంపిడిఓ కళ్యాణి, చినబాలైపల్లి గ్రామంలో జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, తహశీల్దార్ శ్రీనివాస్ హజరయ్యారు. ఎలక్ట్రికల్ స్థంభం మార్చడానికి ఎలక్ట్రికకల్ ఎఇ లేకపోవడంతో సిబ్బంది డబ్బులు వసూలుకు చేస్తున్నారని తహసల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్ ఎంపిటిసి సభ్యులతో పాటు పలు శాఖల అధికారులు జన్మభూమి కమిటి సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్ : ప్రజల సంక్షేమమే టిడిపి లక్ష్యమని ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక విజయరామరాజుపేట మాధవసదన్ పాఠశాల వద్ద నిర్వహించిన ఐదవ విడత జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ రూ.120 కోట్లలతో అమృతస్కీమ్ పథకం కింద తాగునీరు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ షేక్ సుభాని, టౌన్ ప్లానింగ్ అధికారి అమ్మాజీరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, ఉపాధ్యక్షుడు మళ్ల సురేంద్ర, ఎంపి సోదరుడు ముత్తంశెట్టి మహేష్, గుత్తా ప్రభాకరచౌదరి, బిఎస్‌ఎంకె జోగినాయుడు, తాడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో.. : మండలంలోని వెంకటాపురం గ్రామంలో జన్మభూమి కార్యక్రమాన్ని సాదాసీదాగా ప్రారంభించారు. అధికార పార్టీ ప్రవేశపెట్టిన అన్ని పథకాలల్లోను లబ్దిని ఆశిస్తూ కార్యక్రమాలు చేస్తున్న కార్యకర్తలు మధ్య తూతూ మంత్రంగా జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. అయితే వెంకటాపురం గ్రామంలో సంక్షేమం, సంతృప్తి పేరుతో 5వ విడత జన్మభూమి కార్యక్రమాన్ని ప్రారంభించాయి. మండలం మొత్తం మీద అభివృద్ధి పథంలో సాగుతున్న గ్రామంగా నిర్మల పురస్కార్ అవార్డు దక్కిన గ్రామం కనుక మొదట ఆ గ్రామంలో కార్యక్రమం నిర్వహించడంతో ఏ సమస్య తలెత్తకుండా కార్యక్రమం సాఫీగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుందరపు వెంకటకన అప్పారావు, తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కడియం అనూరాధ, స్పెషలాఫీసర్ శ్రీనివాస్, తహశీల్దార్, ఎంఇఒ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో.. : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని ఐదవ విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అంతకు ముందు గర్భిణీలకు సీమంత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, సంక్రాంతి చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. ఉదయం ఎంపిడిఒ షేక్‌బాబూరావు ఆధ్వరాన ఆరిపాకలో సర్పంచ్ శరగడం సాయి అన్నపూర్ణ అధ్యక్షతన తహశీల్దార్ పైలా రామారావు ఆధ్వర్యంలో గొటివాడ, గాలిభీమవరం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. గొటివాడ, గాలి భీమవరంలో సర్పంచ్ వి రమేష్, పిఎసిఎస్ చైర్మన్ బొండా సత్యారావు, ఎంపిపి గొర్లి ఉమామహేశ్వరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆరిపాకలో సర్పంచ్ శరగడం సాయి అన్నపూర్ణ, విశాఖడెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు ప్రత్యేక అదికారి కెఎస్ శాస్త్రీ, వి.రమేష్‌రాజు పాల్గొన్నారు. బంగారమ్మపాలెంలో డ్వ్యామా పిడి కళ్యాణ చక్రపాణి, మండల ప్రత్యేక అధికారి కెఎస్ శాస్త్రీ, ఎంపిడిఒ షేక్‌బాబూరావు, ఆర్ఇసిఎస్ చైర్మన్ కొటాన అప్పారావు, సర్పంచ్ దాడి అప్పారావు, ఎంపిటిసి దొడ్డి అరుణ, సూర్యప్రకాశ్, దొడ్డి రాజుకోటి పాల్గొన్నారు.

కశింకోటలో.. : పోలవరం నీరు వచ్చే ఏడాది నుండి అందిస్తామని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని జన్మభూమి, మాఊరు కార్యక్రమం అన్ని గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యపై ఫిర్యాదు చేసి, రసీదును తీసుకోవాలని చెప్పారు. అనంతరం భీమవరం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న కల్యాణ మండపానికి శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి మండల ప్రత్యేక అధికారి గీతాదేవి, జెడ్‌పిటిసి సభ్యులు మలసాల ధనమ్మ, ఎంపిపి పంచదార్ల లక్ష్మి, మండల టిడిపి అధ్యక్షుడు మలసాల రమణారావు, ఎంపిడిఒ బివి సత్యనారాయణ, ఎఎంసి చైర్మన్ కాయల మురళీ, వేగి గోపీకృష్ణ, డిసిసిబి డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు చిటిమిరెడ్డి మహాలక్ష్మి, ద్వారపురెడ్డి ఆదియమ్మ, ఐసిడిఎస్ పిఒ కెఎంఎల్‌కె కుమారి, ఎంఇఒ మధుసూదనరావు పాల్గొన్నారు.

గొలుగొండలో.. : పేదలకు సంక్షేమపథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి సుర్ల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని చీడికాడ నాగాపురం, ఎ.ఎల్.పురం, పాతకృష్ణదేవిపేట గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరిగింది. నాగాపురంలో ఎంపిపి ఆధ్వర్యంలోను, పాతకేడిపేటలో నర్సీపట్నం మార్కెట్టు కమిటీ చైర్మెన్ అడిగర్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలోను, ఎ.ఎల్‌పురంలో జెడ్‌పిటిసి చిటెకెల తారక వేణుగోపాల్ ఆధ్వర్యంలోను ఈ సభలు నిర్వహించారు. ఎంపిపి మాట్లాడుతూ మండలంలో 80 మందికి కొత్త రేషను కార్డులు వచ్చాయని, జన్మభూమి సభల్లో లబ్దిదారులకు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకఅధికారి శ్రీనివాసు, ఎమ్డీఓ సువర్ణరాజు, తాహసీల్దారు అంబేద్కరు, నాగాపురం సర్పంచ్ కె.రామారావు, ఎ.ఎల్‌పురం సర్పంచ్ లగుడు పద్మ, ఎంపిటిసిలు రామ్మూర్తినాయుడు, రమణమ్మ పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల జాడలేని జన్మభూమి సభలు

జన్మభూమి సభల్లో కొత్త పింఛన్లు అందజేస్తారని ఎదురుచూసిన లబ్దిదారులకు నిరాశే మిగిలింది. మండలంలోని 797 మంది పింఛన్లు కోసం దరకాస్తులు చేసుకోగా 370 మందికే మంజూరు అయ్యాయి. పింఛన్లు తక్కువ రావడంతో సభల్లో లబ్దిదారులకు ఇస్తే గొడవలు జరిగి రసాబస అవుతుందని అధికారులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.


చంద్రన్న బీమా ఇస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

ధర్మ ప్రచార రథం ప్రారంభం

అనకాపల్లిటౌన్ : మండలంలోని సత్యనారాయణపురం హేమగిరి కనకదుర్గ ఆలయంలో మంగళవారం ధర్మ ప్రచార రథాన్ని శ్రీకనకదుర్గ అమ్మవారి అన్నదాన చారిటబుల్ ట్రస్టు సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ కోరుకొండ సాంబశివరావు మాట్లాడుతూ హిందూ దేవాలయాలు లేని గ్రామాల్లో ఈ ప్రచార రథాలు పర్యటిస్తూ హిందూ ధర్మాన్ని వివరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థపకులు బోయిన నాగేశ్వరరావు, శ్రీరామదాసు గోవింద, భక్త భజన బృందాల చైర్మన్ సకలా గోవింద, జి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రబీర్‌రాయ్ చౌదరి

5, 6 తేదీల్లో ఇంపాక్ట్-2018 కన్వెన్షన్

సిఎస్ఐ ఛైర్మన్, ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ ప్రబీర్ రాయ్‌చౌదరి

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

కంప్యూటర్ సైన్స్ ఆఫ్ ఇండియా (వైజాగ్ చాప్టర్) ఆధ్వర్యాన ఇంపాక్ట్-2018 పేర ఈ నెల 5, 6 తేదీల్లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి)పై జాతీయస్థాయి కన్వెన్షన్ నిర్వహిస్తున్నట్లు సిఎస్ఐ ఛైర్మన్, ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ (కమర్షియల్) ప్రబీర్‌రాయ్ చౌదరి వెల్లడించారు. మంగళవారం ఉదయం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌తో కలిసి సిఎస్ఐ వైజాగ్ చాప్టర్ పనిచేస్తోందన్నారు. రోబో టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్, కృత్రిమ మేథస్సు, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఇన్నోవేషన్స్‌కు అవకాశముండే కీలక సమాచారాన్ని, రీసెర్చి పత్రాలను దేశం నలుమూలల నుంచి వచ్చే ప్రతినిధులు విడుదల చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖను హబ్‌గా మార్చాలనే విధానం అనుసరిస్తున్నందున సిఎస్ఐ ఆ దిశగా విద్యార్థుల్లో ఐఒటిపై అవగాహన పెంచుతుందన్నారు. ఎయు ఇంజినీరింగ్ విద్యార్థులతో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో 900 మంది పాల్గొన్నారన్నారు. సెమినార్‌లను, వర్క్‌షాప్‌లను సిఎస్ఐ తరచూ నిర్వహిస్తుందన్నారు. పరిశోధకులు, ఇంజినీర్లు, డవలపర్లు, పరిశ్రమ ఔత్సాహికులు, విద్యావేత్తలు, ఎన్‌జిఒలు పాల్గొనే ఈ కన్వెన్షన్‌లో కొత్త టెక్నాలజీ సమాజానికి ఉపయోగపడే మార్గాలపై చర్చిస్తారన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి)కి సంబంధించి కొన్ని మానుఫ్యాక్చరర్స్ కంపెనీలు, స్టార్టప్‌లు కూడా తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు. మూడు దశాబ్దాలుగా సిఎస్ఐ సేవలందిస్తుందన్నారు. ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఐటి సంస్థలు భాగస్వామ్యం ఉందన్నారు. 600 మంది లైఫ్ మెంబర్స్, 20 స్టూడెంట్ బ్రాంచీలు సిఎస్ఐకి ఉన్నాయన్నారు. తొలిరోజు 5న ప్రారంభమయ్యే ఈ కన్వెన్షన్‌ను స్టీల్‌ప్లాంట్ సిఎండి పి.మధుసూధన్ ప్రారంభిస్తారన్నారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీపై రెండో రోజు ఉదయం ఐఐఎస్‌సి ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.విశ్వనాథం (బెంగళూరు) పాల్గొంటారన్నారు. ఉప్పలపాటి శ్రీనివాసరాజు, ఎయు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ అవధాని, మెషిన్ టెక్నాలజీపై ఇస్రో డైరెక్టర్ డాక్టర్ సెంథిల్‌కుమార్ ప్రసంగిస్తారని తెలిపారు.

నేటి నుంచి సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ టోర్నమెంట్

ఐదు రాష్ట్రాల నుంచి 98 జట్లు

ప్రజాశక్తి- విశాఖపట్నం

ఆంధ్ర యూనివర్సిటీ రెండున్నర దశాబ్దాల తరువాత సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ (మెన్స్) టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. రఘు ఇంజినీరింగ్ కళాశాల సౌజన్యంతో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. మంగళవారం ఎయు అకడమిక్ సెనేట్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టోర్నమెంట్ వివరాలను ఎయు విసి ఆచార్య జి.నాగేశ్వరరావు వెల్లడించారు. టోర్నమెంట్‌లో ఐదు రాష్ట్రాల నుంచి 98 క్రీడా బృందాలు పాల్గొంటున్నాయని తెలిపారు. 1900 మందికి పైగా క్రీడాకారులు, జట్టు సిబ్బంది, కోచ్‌లు, మేనేజర్లు విశాఖ నగరానికి వస్తున్నారని అన్నారు. గతంలో 1982, 1992 సంవత్సరాలలో ఈ పోటీలకు ఆతిథ్యం కల్పించిందని చెప్పారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు రఘు ఇంజినీరింగ్ కళాశాలలో ఈ పోటీలను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభిస్తారని, జెఎన్‌టియుకె వీసీ ఆచార్య విఎస్ఎస్ కుమార్ కూడా పాల్గొంటారని తెలిపారు.

నాకౌట్ విధానంలో పోటీలు జరుగుతాయని, క్రీడా జట్లను నాలుగు పూల్స్‌గా విభజించామని తెలిపారు. గత ఏడాది సెమీఫైనల్స్‌కు చేరిన టీమ్‌లు నేరుగా సూపర్ క్వార్టర్స్‌లో పాల్గొంటాయన్నారు. బిసిసిఐ, ఎసిఎకు చెందిన అంపైర్లు మ్యాచ్‌లను నిర్వహిస్తారన్నారు. మొదటి సారిగా ఆన్‌లైన్ స్కోరింగ్ విధానాన్ని ఈ టోర్నమెంట్‌కు అమలు జరుపుతున్నామని చెప్పారు. కోచ్‌లు, మేనేజర్లు, సాంకేతిక సిబ్బందికి భోజన వసతిని రఘు ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ పోటీల్లో విన్నర్, రన్నర్‌లుగా నిలిచిన వారు రోహతక్‌లోని ఎమ్‌డి యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. విజేతలు బిసిసిఐ నిర్వహించే సర్ విజ్జి ట్రోఫీలో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. బిసిసిఐ ఇద్దరు సెలెక్టర్లను సౌత్‌జోన్ పోటీలకు పంపుతుందని తెలిపారు. క్రీడాకారుల కోసం 20 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రత్యేకంగా ఒక హెల్ప్‌డెస్క్‌ను నిర్వహిస్తున్నామన్నారు. రఘు కళాశాలకు చెందిన వంద మంది వలంటీర్లు కార్యక్రమాన్ని సమన్వయం జరుపుతున్నారన్నారు.

రఘు విద్యాసంస్థల ఛైర్మన్ కలిదిండి రఘు మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విశాఖకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. విభిన్న రాష్ట్రాలకు మన నగర విశిష్టత, వసతులపై అవగాహన ఏర్పడుతుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇటువంటి పోటీలతో విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, ఎయు స్పోర్ట్స్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా వేదికలు

రఘు ఇంజినీరింగ్ కళాశాల, ఎంవిజిఆర్ కళాశాల (విజయనగరం), సర్ విజ్జి స్టేడియం (విజయనగరం), ఎంఆర్ కళాశాల, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, రైల్వే స్టేడియం, పోర్ట్ స్టేడియం, స్టీల్‌ప్లాంట్ ఉక్కు స్టేడియం, స్టీల్‌ప్లాంట్ త్రిష మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు. రఘు ఇంజినీరింగ్ కళాశాలలో 30 టీమ్‌లకు, స్టీల్ ప్లాంట్‌లో 16 టీమ్‌లకు, ఎయులో 52 టీమ్‌లకు వసతి సదుపాయం కల్పించామని తెలిపారు.

2018 ఆకారంలో విద్యార్థులు

ఎంపిపి పాఠశాలలో వినూత్నంగా కొత్త సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - గొలుగొండ

మండలంలో చోద్యం ఎంపిపి పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలోని 2018 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, గ్రామస్తులంతా ఆకట్టుకునే విధంగా విద్యార్థులను 2018 ఆకారంలో అమర్చారు. అనంతరం ఉపాధ్యాయులు కేకును కట్‌చేసి అందరికీ పంచారు.



2018 ఆకారంలో ఉన్న విద్యార్థులు

దక్షిణ మండల మహిళా టెన్నిస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖపట్నం

దక్షిణాది రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలకు అసోసియేషన్ ఆఫ్ ఇండియాన్ యూనివర్సిటీస్ (ఏఐయు) పర్యవేక్షణలో నిర్వహిస్తున్న దక్షిణ మండల మహిళా టెన్నిస్ పోటీలు మంగళవారం గీతం విశ్వవిద్యాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, రాష్ట్రాల నుంచి 39 విశ్వవిద్యాలయాల జట్లు ఈ పోటీలకు హాజరయ్యాయి. పోటీల ప్రారంభోత్సవానికి తూర్పు కోస్తా రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ ముకుల్ శరణ్ మాథుర్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు, ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ఎమ్.పోతరాజు, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. గీతం టెన్నిస్ కోర్టుల్లో జరిగే ఈ పోటీలలో దాదాపు 70 మంది టెన్నిస్ క్రీడాకారిణులు పాల్గొనున్నారు. దక్షిణ మండల మహిళా టెన్నిస్ పోటీల్లో ప్రతిభకనబరిచే క్రీడాకారిణులను ఎంపికచేసి గీతం లోని జనవరి 4వ తేదీ నుంచి జరిగే అఖిలభారత స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముకుల్ శరణ్

తొలిరోజు పోటీల వివరాలు

మొదటి రోజు జరిగిన పోటీలలో మణిపాల్ విశ్వవిద్యాలయంపై ఎమ్‌జి విశ్వవిద్యాలయం 7-4, 7-1 స్కోరుతో విజయం సాధించగా కెఎల్ యు జట్టుపై కాకినాడ జెఎన్‌టియు జట్టు 7-3, 7-2 స్కోరుతో, అన్నామలై యూనివర్సిటీ జట్టుపై రాయలసీమ జట్టు 7-4, 0-7, 7-4 స్కోరుతో, భారతీదాసన్ యూనివర్సిటీ జట్టుపై కాలకట్ యూనివర్సిటీ జట్టు 7-3,7-0 స్కోరుతో విజయం సాధించాయి. మొదటి రోజు 15 జట్లు హాజరు కాకపోవడంతో ప్రత్యర్థి జట్లుకు వాకోవర్ విజేతలుగా ప్రకటించారు.

దక్షిణమండల క్రికెట్ పోటీలకు గీతం జట్టు ఎంపిక

విశాఖపట్నం: దక్షిణాది రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలకు ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దక్షిణ మండల అంతర విశ్వవిద్యాలయాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే గీతం జట్టును ఎంపిక చేసినట్లు గీతం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. జట్టు కెప్టెన్‌గా జి.కృష్ణ వ్యవహరిస్తారని. సభ్యులుగా ఎమ్.ఆయూష్, బి.చంద్రశేఖర్, పి.రోహిత్ వికాస్, పి.గణేష్, వి.హిమాంశురావు, డిఎస్ఎన్.కల్యాణ్, ఎమ్ఎన్.నేతాజీరెడ్డి, కె.అభిజీత్, ఎస్‌వీఎస్ గంగాధర్, పి.విజయసాగర్, ఆర్.కె.గుణచంద్ర, డి.సోమిండ్ రెడ్డి, ఎన్‌డి కుమార్ రెడ్డి, పి.నవీన్‌కుమార్, జిబి.శాయి ప్రశాంత్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. జట్టు మేనేజర్‌గా జి.శ్రీనివాస్ ఉంటారని స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శి తెలిపారు.

నేడు ఉత్తమ మహిళా ఉపాధ్యాయులకు పురస్కారాలు

జిల్లాపరిషత్ :సావిత్రిబాయి పేలే జయంతిని పురస్కరించుకొని ఉత్తమ మహిళా ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి పురస్కారాలను ఈ నెల 3వ తేదీన ప్రదానం చేయనున్నట్లు జిల్లా సర్వశిక్ష అభియాన్ పిఒ బి.శివరామప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ఎ పథకం రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమం బుధవారం ఉదయం 10 ఆంధ్రా యూనివర్సిటీ కాన్వొకేషన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

4న రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ రాక

జిల్లాపరిషత్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ ఈ నెల 4వ తేదీన విశాఖ రానున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుండి 11.30 గంటల వరకు సర్క్యూట్‌హౌస్‌లో వివిధ సంఘాలు, ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం ఫిర్యాదులను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 11.30 నుండి 12 గంటల వరకు పెందుర్తి మండలంలో ఇటీవల మహిళలపై దాడి సంబంధించిన అట్రాసిటీ కేసుపై చర్చిస్తారు.